



PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక
సంపుటి: 5 సంచిక: 349, పేజీలు - 08
మంగళవారం, జూన్ 9, 2026 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD




## ఇక తెలంగాణ కేబినెట్ పంచాయతీ.?

### - మార్పు చేర్పుల సిగ్నల్ రేవంత్‌కు అందిందా.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కర్ణాటక రాజకీయాల్లో కాంగ్రెస్ హైకమాండ్ ఎట్టకేలకు ఒక సందిగ్ధతకు తెరదించింది. తీవ్ర ఉత్కంఠ, అంతర్గత విభేదాల నడుమ అక్కడ ముఖ్యమంత్రి మార్పు ప్రక్రియను ఎలాగోలా పూర్తి చేసింది. అయితే, ఈ మార్పు తర్వాత కర్ణాటక కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు పూర్తిగా చల్లారలేదు, పైకి అంతా ప్రశాంతంగా కనిపిస్తున్నా లోపల నేతల అసంతృప్తిని కవర్ చేయడం హైకమాండ్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. సరిగ్గా ఇదే తరుణంలో, ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లోనూ మంత్రివర్గ విస్తరణ , పునర్వ్యవస్థీకరణ గురించిన చర్చ ఒక్కసారిగా ఊపందుకుంది.

**తెలంగాణ కేబినెట్ విస్తరణపై ప్రచారం**

తెలంగాణలో ప్రస్తుతానికి ముఖ్యమంత్రిని మార్చే ఆలోచన లేదని స్పష్టమవుతున్నప్పటికీ, చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేబినెట్ విస్తరణ మాత్రం ఇప్పుడు ముంచుకొస్తోంది. ఇవాళో, రేపో ఈ ప్రక్రియకు గ్రీన్ సిగ్నల్ వస్తుందనే ప్రచారం జోరుగా సాగుతుండటంతో రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయం కాస్తా ఢిల్లీకి చేరింది. మంత్రి పదవులను ఆశిస్తున్న సీనియర్ నేతలు, ఎమ్మెల్యేలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఇతర హైకమాండ్ పెద్దలను కలుస్తూ లాబీయింగ్ ముమ్మరం చేశారు.

**తీవ్రంగా ప్రయత్నిస్తున్న రాజగోపాల్ రెడ్డి**

ఈ మంత్రి పదవుల రేసులో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అందరికంటే ముందు వరుసలో కనిపిస్తున్నారు. ఆయన స్వయంగా ఢిల్లీలో రాహుల్ గాంధీని కలిసి తన మంత్రి పదవి గురించి గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పుడే ఆయన కేబినెట్ బెర్త్ ఆశించినప్పటికీ, కొన్ని సమీకరణాల వల్ల దక్కలేదు. దీంతో ఈసారి ఎలాగైనా మంత్రివర్గంలో చోటు సంపాదించుకోవాలనే పట్టుదలతో రాజగోపాల్ రెడ్డి తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆయనతో పాటు రేసులో ఉన్న ఇతర సీనియర్ ప్రజాప్రతినిధులు కూడా ఢిల్లీ వేదికగా మంతనాలు సాగిస్తున్నారు.

**మంత్రివర్గాన్ని కదిలిస్తే రచ్చే**

తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గాన్ని కదిలించడం అనేది తేనెతుట్టెను కదిలించడమేనని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న కొందరిని తప్పించి కొత్తవారిని తీసుకోవడం లేదా ఖాళీలను భర్తీ చేయడం ఏమాత్రం సాదాసీదాగా సాగే ప్రక్రియ కాదు. సీనియార్టీ, సామాజిక సమీకరణాలు, ప్రాంతాల వారీగా బ్యాలెన్స్ చేయాల్సి రావడం పెద్ద సవాల్. ఒకరికి పదవి వస్తే మరొకరు తీవ్ర అసంతృప్తికి లోనయ్యే ప్రమాదం ఉంది. పార్టీని నమ్ముకుని ఉన్న అనేక మంది ఆశావహులు తమకు అన్యాయం జరిగితే బహిరంగంగానే రచ్చ చేసేందుకు, తిరుగుబావుటా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉన్నారు.

2లో..

## దీదీకి భారీ షాక్.. చీలిన తృణమూల్

### - ఎన్డీయే కూటమిలోకి 20 మంది లోక్‌సభ ఎంపీలు.. స్పీకర్‌కు లేఖ!



**కోలకతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి జాతీయ రాజకీయాల్లో ఊహించని కోలుకోలేని దెబ్బ తగిలింది. బెంగాల్ ఎమ్మెల్యేలు తిరుగుబాటు చేసిన కొద్ది రోజుల వ్యవధిలోనే, ఇప్పుడు ఆ పార్టీ పార్లమెంటరీ వింగ్‌లోనూ భారీ చీలిక స్పష్టమైంది. టీఎంసీకి చెందిన దాదాపు 20 మంది లోక్‌సభ సభ్యులు తాము కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నట్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు అధికారికంగా లేఖ రాశారు.

**మూడింట రెండు వంతుల మంది ఎంపీల చీలిక**

ఈ తిరుగుబాటుకు నేతృత్వం వహించిన సీనియర్ టీఎంసీ ఎంపీ, బారాసత్ నియోజకవర్గ ప్రతినిధి కాకోలి ఘోష్ దస్తీదార్ ఢిల్లీలో మీడియాకు ఈ సంచలన వివరాలను వెల్లడించారు. 20 మంది లోక్‌సభ ఎంపీలం ఎన్డీయే కూటమికి మద్దతు ఇవ్వాలని నిర్ణయించుకున్నాం. ఈ మేరకు మా నిర్ణయాన్ని స్పీకర్ ఓం బిర్లాకు లేఖ ద్వారా తెలియజేసాం అని ఆమె ప్రకటించారు. బెంగాల్ ఎన్నికల ఫలితాల తర్వాత దేశంలో మారుతున్న రాజకీయ పరిణామాలను తాము అంగీకరిస్తున్నామని, తమ భవిష్యత్తు రాజకీయ పంథా ఎన్డీయేతోనే సాగాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె

2లో..

## రేవంత్ రెడ్డి ..ఓ తాలిబన్

### - తెలంగాణ సీఎంపై కవిత ఆగ్రహం

- విద్యా వ్యవస్థను రేవంత్ రెడ్డి అస్తవ్యస్తం చేస్తున్నారన్న కవిత
- ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు తగ్గించాలని ప్రభుత్వం యోచిస్తోందని విమర్శ
- రూ. 11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెండింగ్ లో ఉన్నాయని మండిపాటు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిట్లర్ కంటే ఎక్కువ అని, ఆయన ఓ తాలిబన్ అని టీఆర్ఎస్ (తెలంగాణ రక్షణ సేన) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థపై తీసుకుంటున్న నిర్ణయాలపై కవిత తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న 27 వేల ప్రభుత్వ పాఠశాలలను కేవలం 4 వేలకు కుదిస్తామంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలను ఆమె తీవ్రంగా తప్పుపట్టారు. సోమవారం ఈ మేరకు ఒక వీడియో సందేశాన్ని విడుదల చేసిన కవిత రేవంత్ రెడ్డి కేవలం హిట్లర్ మాత్రమే కాదు, అంతకంటే ఎక్కువ అని, ఆయన ఒక తాలిబన్ లా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. పేద పిల్లలకు, ముఖ్యంగా ఆడపిల్లలకు

2లో..

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ పేలుడు

### - 9కి చేరిన మృతుల సంఖ్య



**విశాఖపట్నం (ప్రశ్న న్యూస్)** విశాఖ స్టీల్ ప్లాంట్లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం 4:15 గంటల ప్రాంతంలో ప్లాంట్‌లోని ఎస్ఎంఎస్-2, ఎస్‌టీసీ-3 హీట్ ఎఫ్‌జీలో స్టీల్ మెటల్ లిక్విడ్ లాడిల్ పేలడంతో ఉక్కుద్రవం లీకై మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగింది. 1500 డిగ్రీల వేడితో స్టీల్ మెటల్ లిక్విడ్ ల్యాడిల్ ద్వారా ఉక్కుద్రవాన్ని లిఫ్ట్ చేస్తుండగా

2లో..

## 2027 నాటికి భూ రికార్డులు క్లీన్



### - సిద్ధాంతం 'మీ భూమి - మీ హక్కు' సభలో సీఎం చంద్రబాబు

- 2027 నాటికి రాష్ట్రంలోని భూ రికార్డులన్నింటినీ ప్రక్షాళన
- కరెన్సీ నోట్ల తరహా భద్రతా ప్రమాణాలతో కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ల జారీ
- గొడ్డలి పట్టుకునే వారికి నాగలి పట్టే రైతుల కష్టాలు తెలియవంటూ తీవ్ర విమర్శలు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** పశ్చిమ గోదావరి జిల్లా సిద్ధాంతంలో సోమవారం నిర్వహించిన 'మీ భూమి - మీ హక్కు' సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటనలు చేశారు. 2027 నాటికి రాష్ట్రంలోని భూ రికార్డులన్నింటినీ ప్రక్షాళన చేసి, ప్రతి రైతు చేతిలో తప్పులు లేని పట్టాదారు పాస్‌బుక్ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో భూ రికార్డుల నిర్వహణలో జరిగిన అవకతవకల కారణంగా రాష్ట్రంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని, పచ్చని గోదావరి జిల్లాల్లో సైతం భూవివాదాలకు ఆజ్యం పోశారని ఆయన ఆరోపించారు. రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్‌బుక్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

2లో..

## చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

### - అన్ని ఏర్పాట్లు చేసినట్టు సీపీ సజ్జనార్ వెల్లడి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో 'చేప ప్రసాదం' పంపిణీ కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేసినట్లు సీపీ సజ్జనార్ వెల్లడించారు. ఈ రోజు రాత్రి 9 గంటల నుంచే ఈ పంపిణీ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇప్పటికే మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్‌లు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించారని దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 25 వేల మంది ఇప్పటికే నగరానికి చేరుకున్నారని ఆయన తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వెయ్యి మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశామని ఈ భద్రతా చర్యలను గోల్కొండ డీసీపీ చంద్రమోహన్ పర్యవేక్షిస్తారని వెల్లడించారు. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, అత్యవసర వైద్య సేవల కోసం ఐదు అంబులెన్సులను సిద్ధంగా ఉంచామని చెప్పారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా వివిధ

2లో..

## తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డే

### - మియాపూర్ సభలో 30 నెలల పాలనపై చర్చకు సీఎం రేవంత్ సవాల్!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** మియాపూర్‌లో నిర్వహించిన 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభ వేదికగా తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్‌లపై తీవ్ర విమర్శలు చేశారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ ఎంపీ జి. కిషన్ రెడ్డి లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన పదునైన విమర్శలు, సవాల్‌లు హాట్ టాపిక్ అవుతున్నాయి. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుండి నిధులు రాకుండా కిషన్ రెడ్డి అడ్డుపడుతున్నారని విమర్శించారు.

**హైదరాబాద్ అభివృద్ధికి పక్కా ప్రణాళికలు**

హైదరాబాద్ మహా నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న ఆరు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ వేగంగా విస్తరిస్తోందని, భవిష్యత్ అవసరాల కోసమే నగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామని తెలిపారు. ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వరదలు, బెంగళూరులో ట్రాఫిక్ కష్టాలను ఉదహరిస్తూ హైదరాబాద్‌లో అలాంటి పరిస్థితులు రాకుండా ఒక పద్ధతి ప్రకారం మెట్రో రెండో దశ విస్తరణ, గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను చేపట్టబోతున్నామని ప్రకటించారు. జెండాలు, ఎజెండాలకు అతీతంగా నగరాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు.

**కిషన్ రెడ్డికి రాజకీయాలే ఎక్కువయ్యాయి!**

అభివృద్ధి గురించి మాట్లాడుతుంటే ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని సీఎం రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ముఖ్యంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చేవెళ్ల, మెదక్, మల్కాజ్‌గిరి, సికింద్రాబాద్ ఎంపీలుగా గెలిచిన బీజేపీ నేతలకు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయాలే ఎక్కువయ్యాయని ధ్వజమెత్తారు. "కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ప్రధాని మోదీని తెలంగాణకు నిధులు ఇవ్వాలని ఎందుకు అడగడం లేదు? రాష్ట్రానికి రావలసిన నిధులను రాకుండా అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డి కాదా?" అని రేవంత్ రెడ్డి నిలదీశారు. ప్రధాని మోదీ గుజరాత్‌లోని సబర్మతి నదిని అభివృద్ధి చేసుకుంటే ఆహా ఓహో అనే వీరు తాము మూసీ నదిని ప్రక్షాళన చేస్తామంటే ఎందుకు అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

2లో..

## నవభారత నిర్మాణంలో బొగ్గు రంగానిదే కీలక పాత్ర

- కాంగ్రెస్ హయాంలో కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్ గా బొగ్గు ఉండేదన్న కిషన్ రెడ్డి
- రూ. 1.86 లక్షల కోట్ల బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని వెల్లడి
- తెలంగాణలో బీజేపీకి అధికారం వస్తే సింగరేణి కార్మికుల ఆదాయపు పన్ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వ్యాఖ్య



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నవభారత నిర్మాణంలో బొగ్గు రంగం అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్ కల్చరల్ సెంటర్ లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ, గత యూపీఏ ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ హయాంలో 'బొగ్గు' అంటే కేవలం కుంభకోణాలు, అవినీతి, అనిశ్చితికి మాత్రమే కేరాఫ్ అడ్రస్‌గా మారిందని మండిపడ్డారు. గత యూపీఏ పాలనలో బొగ్గు శాఖ మంత్రిగా పనిచేసిన వ్యక్తి జైలుకు కూడా వెళ్లారని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఆ కాలంలో ఏకంగా రూ. 1.86 లక్షల కోట్ల భారీ బొగ్గు కుంభకోణాన్ని కాగ్ బట్టబయలు చేసిందని, ఆ తర్వాత సుప్రీంకోర్టు సైతం యూపీఏ ప్రభుత్వం కేటాయించిన అన్ని బొగ్గు గనుల కేటాయింపులను రద్దు చేసిందని

2లో..

## పెళ్లికి ముందు శారీరక సంబంధం నేరం కాదు

### - తెలంగాణ కానిస్టేబుల్ కేసులో సుప్రీంకోర్టు సంచలన తీర్పు!

2లో..



## కలిసుంటే నిలబడతాం.. లేకుంటే పడిపోతాం

- సీజేఐ దృష్టికి ఎస్ఐఆర్‌ను తీసుకెళ్లనున్న ప్రతిపక్షాలు
- ప్రతి రెండు నెలలకు ఒకసారి భేటీ కావాలని నిర్ణయం
- హైదరాబాద్‌లో తదుపరి ఇండియా కూటమి సమావేశం

2లో..



# ఇక తెలంగాణ కేబినెట్ పంచాయతీ.?

### కర్ణాటక అసంతృప్తితో ఇక్కడ మరింత జాగ్రత్త

కర్ణాటకలో ఎదురైన అనుభవాల దృష్ట్యా, తెలంగాణలో మంత్రివర్గ ప్రక్షాళన చేపట్టేటప్పుడు హైకమాండ్ అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. కేబినెట్ బెర్త్ దక్కని నేతలు రేపే అసంతృప్తి శృతిమించితే, అది ప్రభుత్వ సుస్థిరతపై, పార్టీ అంతర్గత క్రమశిక్షణపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. జరగబోయే కేబినెట్ మార్పు చేర్పుల వల్ల తెలంగాణ కాంగ్రెస్‌లో కొత్త జోష్‌ను నింపుతాయా లేక అసంతృప్తి జ్వాలలకు దారితీస్తాయా అనేది వేచి చూడాలి.

# దీదీకి భారీ షాక్.. చీలిన తృణమూల్

స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్‌సభలో తృణమూల్ కాంగ్రెస్‌కు 28 మంది ఎంపీల బలం ఉంది. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు పడకుండా లోక్‌సభలో అధికారికంగా చీలిక తెచ్చి ప్రత్యేక గ్రూపుగా ఏర్పడాలంటే కనీసం మూడింట రెండొంతుల మంది అంటే.. 19 మంది ఎంపీల మద్దతు అవసరం. ఇప్పుడు కాకోలి ఘోష్ దస్తీదార్ నేతృత్వంలోని అసంతృప్త గ్రూపులో సరిగ్గా 20 మంది ఎంపీలు ఉండటంతో చట్టపరమైన ఇబ్బందులు లేకుండా వీరంతా ఎన్డీయే వైపు మొగ్గు చూపినట్లు స్పష్టమవుతోంది. ఈ ఎంపీలంతా కలిసి అభిషేక్ బెనర్జీని తమ పార్లమెంటరీ పార్టీ నేత పదవి నుండి తొలగించి, విడిగా కూర్చోవడానికి అనుమతించాలని స్పీకర్‌ను కోరనున్నారు.

### ఢిల్లీలోనే ఇండీ కూటమి సమావేశంలో మమతా బెనర్జీ

ఒకవైపు తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ ఢిల్లీలో జరుగుతున్న ఇండియా కూటమి సమావేశానికి హాజరైన సమయంలోనే, ఆమెకు తెలియకుండా ఈ 20 మంది ఎంపీలు ఢిల్లీలోని ఒక రహస్య ప్రదేశంలో సమావేశమై ఈ ఆపరేషన్‌ను పూర్తి చేశారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించిందని, కేవలం జూనియర్ నేతలకు, కొద్దిమందికే ప్రాధాన్యత ఇస్తూ సీనియర్లను అవమానిస్తున్నారని తిరుగుబాటు నేతలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే రాజ్యసభ ఎంపీ సుఖేందు శేఖర్ రాయ్ తన పదవికి, పార్టీకి రాజీనామా చేయగా, ఆ మంటలు ఇప్పుడు లోక్‌సభ ఎంపీల దాకా పాకాయి.

### ఇప్పటికే ఎమ్మెల్యేలు సొంత కుంపటి

ఈ పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ సీనియర్ నేత సౌగతా రాయ్ స్పందిస్తూ, కొందరు ఎంపీలు విడిగా సమావేశమైన మాట వాస్తవమేనని, అయితే వారు ఏం చర్చించారనేది వారికే తెలియాలని వ్యాఖ్యానించారు. బీజేపీ నేతలు తమను కూడా సంప్రదించారని, కానీ ఈ వయసులో తాను పార్టీ మారే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. కాగా, కాకోలి ఘోష్ దస్తీదార్ గత కొద్దిరోజులుగా పార్టీలోని కొందరు నేతల ప్రవర్తనపై, ముఖ్యంగా ఎంపీ కల్యాణ్ బెనర్జీ దురుసుతనంపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తూ పార్టీ అంతర్గత పదవులకు రాజీనామా చేశారు. బెంగాల్ అసెంబ్లీలో ఇప్పటికే 58 మంది ఎమ్మెల్యేలు చీలిపోయి రిటబ్రత బెనర్జీ నేతృత్వంలో విడిగా ప్రతిపక్ష హోదాను క్లెయిమ్ చేస్తుండగా, ఇప్పుడు పార్లమెంట్‌లోనూ 20 మంది లోక్‌సభ సభ్యులు చేజారిపోవడం మమతా బెనర్జీ రాజకీయ జీవితంలోనే అతిపెద్ద సంక్షోభంగా మారింది.

# 2027 నాటికి భూ రికార్డులు క్లీన్

### 2027 నాటికి భూ రికార్డుల ప్రక్షాళన

గత ప్రభుత్వ నిర్వాకాల వల్ల భూ రికార్డులు పూర్తిగా తారుమారయ్యాయని, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన కీలక సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించేందుకు ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ లాంటి ప్రమాదకరమైన చట్టాన్ని రద్దు చేశామని గుర్తుచేశారు. ప్రస్తుతం జారీ చేస్తున్న పట్టాదారు పాస్‌బుక్‌లకు కరెన్సీ నోట్ల తరహాలో క్యూఆర్ కోడ్‌తో పాటు అత్యంత పటిష్ఠమైన భద్రతా ఫీచర్లను పొందుపరిచామని వివరించారు. రికార్డుల ప్రక్షాళన ఒక సంక్లిష్టమైన ప్రక్రియ అని, గత పాలకులు సృష్టించిన గందరగోళాన్ని సరిదిద్దడానికి సుమారు మూడేళ్ల సమయం పడుతుందని అంచనా వేశారు. 2027 నాటికి రాష్ట్రంలోని ప్రతి రైతుకు కచ్చితమైన, వివాదరహితమైన పాస్‌బుక్ అందించి తీరుతామని ఆయన హామీ ఇచ్చారు.

### రెవెన్యూ శాఖలో సమూల మార్పులు

భూ రికార్డుల వ్యవస్థలో పారదర్శకత, భద్రతకు పెద్దపీట వేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా బ్లాక్‌చెయిన్ ఆధారిత భూ రికార్డుల వ్యవస్థను అమలు చేస్తున్నామని, దీని ద్వారా ప్రతి భూమి యూనిట్‌కు ఒక శాశ్వత బ్లాక్‌చెయిన్ ఐడీ కేటాయిస్తామని వెల్లడించారు. ఈ విధానంతో రికార్డులను ట్యాంపరింగ్ చేయడం అసాధ్యమని స్పష్టం చేశారు. ఇప్పటికే 'రీ-సర్వే 2.0' కింద 1,836 గ్రామాల్లో తుది రికార్డ్ ఆఫ్ రైట్స్ పూర్తి చేశామని, విక్రయం, బహుమతి, విభజన వంటి 9 లక్షల లావాదేవీలకు 100 శాతం ఆటోమేటిక్ మ్యుటేషన్ ప్రక్రియను అమలు చేస్తున్నామని తెలిపారు. వాట్సాప్ ద్వారా మ్యుటేషన్ దరఖాస్తు చేసుకునే, దాని స్థితిని తెలుసుకునే సౌకర్యం కల్పించామన్నారు. వారసత్వ హక్కుల బదిలీని సులభతరం చేశామని, రూ.10 లక్షల లోపు విలువైన ఆస్తులకు కేవలం రూ.100 నామమాత్రపు రుసుముతో బదిలీ చేస్తున్నామని వివరించారు. తిరుపతి జిల్లాలో దశాబ్దాలుగా నలుగుతున్న శెట్టిపల్లి గ్రామ భూముల వివాదాన్ని పరిష్కరించామని, 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీసు ఇనామ్ భూములను 22ఏ జాబితా నుంచి తొలగించామని గుర్తుచేశారు.

### గొడ్డలి పార్టీకి రాజకీయ అర్హత లేదు

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రతిపక్షంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "గొడ్డలి పట్టే చేతులకు నాగలి పట్టే రైతుల కష్టాలు ఎలా తెలుస్తాయి? కోడికత్తి డ్రామాలు ఆడేవారికి వరికోతల గురించి ఏం తెలుస్తుంది?" అంటూ ఎద్దేవా చేశారు. గంజాయి బ్యాచ్‌లను ఓదార్చే వారికి పంటల సాగు విలువ తెలియదని విమర్శించారు.

తాము రాజముద్రతో ప్రజలకు హక్కు పత్రాలు ఇస్తున్నామని తెలిపారు. గత పాలకులు దొంగ పట్టాలు సృష్టించి భూ కబ్జాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తెలంగాణలో ఎమ్మార్వో, జేసీ సంతకాలను ఫోర్జరీ చేసి రూ.1500 కోట్ల విలువైన భూములను కొట్టేసిన వారి పార్టీ నేతను ఎందుకు సస్పెండ్ చేయలేదని ప్రశ్నించారు. నేరాలు చేసి ఎదుటివారిపై బురద చల్లడం గొడ్డలి పార్టీకి అలవాటని, రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు క్షమాపణ చెప్పే వరకు వారికి రాజకీయాలు చేసే అర్హత లేదని తేల్చిచెప్పారు.

### సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుందని, ఈ కాలంలో సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనను సమపాళ్లలో అందించామని చంద్రబాబు అన్నారు. ఈ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తిరుపతి, అమరావతి, విశాఖపట్నంలో మూడు భారీ సభలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలతో పాటు, చెప్పినవాటి కంటే అదనంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. పెన్షన్లు, తల్లికి వందనం, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ వంటి పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. డీఎస్సీ ద్వారా 16,000 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశామని, దీన్ని చూసి ఓర్వలేకే ప్రతిపక్షం అనవసర ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు.

### ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్‌కు పెద్దపీట

గోదావరి జిల్లాల అభివృద్ధిలో ఆక్వా, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.50కే అందిస్తున్నామని గుర్తుచేశారు. సోయాబీన్ మీల్ దిగుమతులపై సుంకాలు తగ్గించి, ఫీడ్ ధరలను నియంత్రించాలని కేంద్రాన్ని కోరామన్నారు. ఆక్వా వ్యర్థాలనుంచి న్యూట్రాస్యూటికల్ ఔషధాలు తయారు చేయడం ద్వారా కాలుష్య సమస్యను అధిగమించడంతో పాటు, అదనపు ఆదాయం కూడా సృష్టించవచ్చని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించామని వివరించారు.

### యోగాంధ్రతో ఆరోగ్యవంతమైన రాష్ట్రం

ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని డిజిటల్ హెల్త్ రికార్డ్' కార్యక్రమాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న కోటి మందితో 'యోగాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను సంపన్నమైన, ఆనందకరమైన, ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. అనంతరం, సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్థానిక ఉత్పత్తుల స్టాళ్లను సీఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి ఓ తాలిబన్

చదువును దూరం చేయడానికే ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యాశాఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సర్కస్ లాగా మార్చేశారని, ఆ శాఖపై ఆయన పూర్తిగా పట్టు కోల్పోయారని కవిత విమర్శించారు. ఈ ఏడాది ఇంటర్మీడియట్ వ్యవస్థ ఉండదంటూ సీఎం ప్రకటించిన మరుసటి రోజే ఇంటర్ బోర్డు అడ్మిషన్ల నోటిఫికేషన్ ఇవ్వడం ఇందుకు నిదర్శనమన్నారు. జూనియర్ కాలేజీలు ప్రారంభమై వారం రోజులు గడుస్తున్నా, ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు ప్రభుత్వం కనీసం అఫిలియేషన్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. అటు డిగ్రీ అడ్మిషన్లను సైతం గందరగోళంగా మార్చేశారని, హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ మరియు కమిషనరేట్ మధ్య సమన్వయం లేకపోయినా దోస్త్ అడ్మిషన్ల ప్రక్రియను ఎలా కొనసాగిస్తున్నారని ఆమె ప్రశ్నించారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో 100 మందికి పైగా విద్యార్థులు మరణించినా సీఎం రేవంత్ రెడ్డి కనీసం సమీక్ష కూడా నిర్వహించకపోవడం దారుణమన్నారు. రూ.11 వేల కోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించకుండా తప్పించుకోవడానికే, విద్యార్థులకే నేరుగా ట్యూషన్ ఫీజులు ఇస్తామంటూ జీవో నంబర్ 7ను తీసుకువచ్చారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జీవో వల్ల ప్రైవేట్ కాలేజీలు విద్యార్థులను నిలువునా దోచుకునే ప్రమాదం ఉందని, కాబట్టి వెంటనే జీవో రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. అలాగే ప్రైవేట్ స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు ఫీజుల నియంత్రణ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తీసుకురావాలని ఆమె స్పష్టం చేశారు.

# విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భారీ పేలుడు

ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో 9 మంది మృతి చెందగా, 11 మందికి గాయాలయ్యాయి. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. ఒక్కసారిగా పేలుడు సంభవించడంతో ఉద్యోగులు, కార్మికులు భయాందోళనకు గురై బయటకు పరుగులు తీశారు. ఘటనా స్థలానికి చేరుకున్న అధికారులు సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు యత్నిస్తున్నారు. మృతులు అప్పారావు, ప్రభాకర్‌రావు, కృష్ణ, రమణ, త్రినాథ్, గోల్డ్ కుమార్, అప్పలరాజు, భానుకుమార్, రామనాథ్గా అధికారులు గుర్తించారు. వీరిలో ఆరుగురు ఉద్యోగులు కాగా ముగ్గురు ఒప్పంద కార్మికులని తెలిపారు. గాయపడిన రావూరి మల్లికార్జునరావు, పల్లెల శ్రీనివాస్, అర్జున అప్పారావు, సత్యనంద్, సూరిబాబు, పైడిరాజులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనా స్థలాన్ని హోంమంత్రి అనిత, విశాఖ ఎంపీ భరత్ పరిశీలించారు. ప్రమాదం ఏ విధంగా జరిగిందో ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు, భద్రతా చర్యలు, బాధిత ఉద్యోగులకు అందిస్తున్న వైద్య సేవలపై వారు ఆరా తీశారు. గాయపడిన ఉద్యోగులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను అనిత ఆదేశించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ దుర్ఘటనపై ప్రధాని మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు మోదీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రధాన మంత్రి కార్యాలయం ట్వీట్ చేసింది. పీఎం రిలీఫ్ ఫండ్ కింద మృతుల కుటుంబాలకు రూ.2లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేలు అందిస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

# చేప ప్రసాదం పంపిణీకి సర్వం సిద్ధం

భాషల్లో భక్తులకు సూచనలు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. అందరికీ సరిపడా ప్రసాదం అందుబాటులో ఉందని, ఎలాంటి పుకార్లను నమ్మవద్దని సీపీ స్పష్టం చేశారు. స్థానికులు రద్దీని బట్టి రేపైనా వచ్చి ప్రసాదం తీసుకోవచ్చని సూచించారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది నిరంతరం నిఘా ఉంచుతారని చెప్పారు. చేప ప్రసాదం కోసం వచ్చిన వాళ్లు రాత్రి వేళల్లో పోలీసులకు సహకరించాలని కోరారు.

# తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నది కిషన్ రెడ్డే

బీజేపీ, బీఆర్ఎస్‌ల మధ్య సాగుతున్న అంతర్గత బంధాన్ని ఎండగడుతూ 'చీకటి ఒప్పందాల'పై సీఎం సంచలన వ్యాఖ్యలు చేశారు. తాము దిల్లీకి వెళ్లి రాష్ట్ర ప్రయోజనాల కోసం ప్రయత్నిస్తుంటే, దాన్ని చెడగొట్టడానికి కిషన్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. "నేను ప్రధానిని కలిస్తే ఈయన పోయి కలుస్తాడు.. నేను కేంద్ర మంత్రిని కలిస్తే ఈయన పోయి కలుస్తాడు. తెలంగాణకు నిధులు రాకుండా, ప్రగతి జరగకుండా నిరంతరం కాళ్లలో కట్టెలు పెడుతున్నారు" అంటూ మండిపడ్డారు. కేసీఆర్, కిషన్ రెడ్డిల అవినీతి, అహంకార వైఖరిని ప్రజలు గమనిస్తున్నారని, ఇదే తీరు కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో ఇద్దరికీ తెలంగాణలో పుట్టగతులు లేకుండా ప్రజలు బుద్ధి చెబుతారని, మళ్లీ ఢిల్లీ మొహం చూడకుండా చేస్తారని హెచ్చరించారు.

### పాలనపై చర్చకు సవాల్

రాష్ట్రంలో గత పదేళ్ల కేసీఆర్ పాలన, కేంద్రంలో పన్నెండేళ్ల మోదీ పరిపాలనతో పాటు కేవలం 30 నెలల తమ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. ఎవరేం చేశారో, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో తేల్చుకుందాం రాలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. తమ హయాంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి ద్వారా స్టాల్స్, పెట్రోల్ బంకుల యాజమాన్య హక్కులు కల్పించామని గుర్తుచేశారు. విద్యార్థుల కోసం యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, ఇంటర్ వరకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తున్నామని చెబుతూ చేతనైతే అభివృద్ధికి సూచనలు చేయాలి తప్ప అడ్డుపడవద్దని హితవు పలికారు.

### లక్ష ఇళ్ల నిర్మాణం

మహానగరంలో ప్రభుత్వ భూములను కబ్జాదారుల నుంచి విడిపించి, అక్కడ నిరుపేదల కోసం లక్ష ఎల్ఐజీ, ఎమ్ఐజీ ఇళ్లను నిర్మించబోతున్నట్లు వెల్లడించారు. గతంలో రాజీవ్ గృహకల్ప తరహాలోనే ఎక్కడికక్కడ పేదలకు సొంతింటి కలను నిజం చేస్తామని భరోసా ఇచ్చారు. రాబోయే 24 నెలల కాలం కేవలం అభివృద్ధి, సంక్షేమంపైనే తమ ప్రభుత్వం పూర్తి దృష్టి సారిస్తుందని, రాజకీయ పగప్రతీకారాలకు తావులేకుండా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## కలిసుంటే నిలబడతాం..

# లేకుంటే పడిపోతాం

న్యూఢిల్లీ దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం జరిగిన ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల భేటీకి మొత్తం 23 పార్టీలు హాజరయ్యాయి. ఈ సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాట్లాడ్నరీ.. 'ఐకమత్యమే మహాబలం'అనే సందేశం ఇచ్చారు. 'కలిసుంటే బలం.. విడిపోతే పతనం' అని ఆయన నొక్కి చెప్పారు. మన ఉమ్మడి ప్రత్యర్థి అయిన బీజేపీ నుంచి ఎదురయ్యే సవాలును తిప్పికొట్టడానికి మిత్రపక్షాలు కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలని రాహుల్ గాంధీ హెచ్చరించారు. అలాగే, మిత్రపక్షాలను ఒకరినొకరు కించపరచుకోవద్దని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

"దేశం, రాజ్యాంగ పరిరక్షణ కోసం" బీజేపీకి వ్యతిరేకంగా కలిసి పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. దాదాపు 15 నిమిషాల పాటు ప్రసంగించిన రాహుల్ 'ఓట్ చోరీ' సహా కొన్ని అంశాల్లో కూటమిలోని కొన్ని భాగస్వామ్య పార్టీల నుంచి కాంగ్రెస్‌కు సరైన మద్దతు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తృణమూల్ కాంగ్రెస్, వామపక్షాల వంటి పార్టీలపై రాహుల్ అసహనం వ్యక్తం చేసినట్టు వర్గాలు తెలిపాయి. ఇక, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)కు సంబంధించిన ఆందోళనను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దృష్టికి తీసుకెళ్లాలనే ఏకాభిప్రాయానికి వచ్చింది. ఈ లేఖను వీలైనంత త్వరగా ప్రధాన న్యాయమూర్తికి సమర్పించాలని ఇండియా కూటమి భావిస్తోంది. గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలను ఉదహరిస్తూ బీజేపీని 'ఓడించడం కష్టం' కాదని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. నిరంతర అంతర్గత కలహాల ద్వారా ప్రతిపక్షం తనను తాను బలహీనపరుచుకోకుండా ఉండాలని ఆయన అన్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ 240 సీట్లకే పరిమితమైంది.

2019లో ఆ పార్టీ సొంతంగా 303 స్థానాల్లో గెలిచింది. ఇక, కాంగ్రెస్ 99 స్థానాల్లో గెలిచి, 2019 కంటే (52) మెరుగైన ఫలితాలు సాధించింది. కేంద్రం తీసుకొచ్చిన డీలిమిటేషన్ బిల్లును ఓడించడానికి ప్రతిపక్షాలు ఏకతాటిపైకి రావడం లోక్‌సభలో ఐక్యతకు తాజా ఉదాహరణ. "2026 ఏప్రిల్ 17న మోదీ ప్రభుత్వ దురుద్దేశపూరిత డీలిమిటేషన్ బిల్లులను ఓడించడానికి మనమందరం ఏకమై లోక్‌సభలో మన ఐక్యతను, సంఘీభావాన్ని చాలా నిర్ణయాత్మకంగా ప్రదర్శించాం. ఇప్పుడు మనం అదే స్ఫూర్తిని మరింత బలోపేతం చేసుకుని ముందుకు సాగాలి. తద్వారా మోదీ ప్రభుత్వ దుష్పరిపాలన కారణంగా దేశం ఎదుర్కొంటున్న అనేక రాజకీయ, ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధాన సవాళ్లను మనం ఎదుర్కోగలుగుతాం" అని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి సమావేశం కావాలని కూటమి నిర్ణయించుకుంది. తదుపరి సమావేశం ఆగస్టు 8న హైదరాబాద్‌లో జరగనుంది. నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన నెల రోజుల తర్వాత ఇండియా కూటమి పార్టీలు సమావేశమయ్యాయి. ఇక, అసోం, పశ్చిమ్ బెంగాల్‌లో బీజేపీ, కేరళలో కాంగ్రెస్, తమిళనాడు విజయ్ పార్టీ విజయం సాధించాయి.

## నవభారత నిర్మాణంలో

# బొగ్గు రంగానిదే కీలక పాత్ర

పేర్కొన్నారు. దీనికి భిన్నంగా, గత 12 ఏళ్ల ఎన్డీయే పాలనలో బొగ్గు రంగాన్ని అవినీతి రహితంగా మార్చామని ప్రస్తుతం దేశంలో బొగ్గు నిల్వలు రికార్డు స్థాయిలో 189 మిలియన్ టన్నులకు చేరుకున్నాయని తెలిపారు. భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రస్తుతం 'అండర్‌గ్రౌండ్ కోల్ గ్యాసిఫికేషన్' (బొగ్గు వాయువుగా మార్చే ప్రక్రియ) పై చురుగ్గా అధ్యయనం చేస్తోందని మంత్రి వెల్లడించారు. దీనిపై ప్రైవేట్ కంపెనీలతో జూన్ 11న ఒక కీలక సమావేశం జరగనుందని, 2028 నాటికి అన్ని బొగ్గు బ్లాకులను మూసివేయాలనే లక్ష్యంతో కేంద్రం పనిచేస్తోందని తెలిపారు. అలాగే క్రిటికల్ మినరల్స్ మిషన్ కింద రూ. 1,500 కోట్లు మంజూరు చేశామని ప్రస్తుతం భారతదేశం 24 రకాల కీలక ఖనిజాలను దిగుమతి చేసుకుంటోందని, ఇందులో భాగంగానే అర్జెంటీనాలో 6 క్రిటికల్ మినరల్ బ్లాకులను ప్రభుత్వం దక్కించుకుందని వివరించారు. రాష్ట్రంలో భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తే సింగరేణి కార్మికులు చెల్లించాల్సిన ఆదాయపు పన్నును ప్రభుత్వమే స్వయంగా చెల్లిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణలో పార్టీ రాజకీయ ఉనికిని బలోపేతం చేయడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లే వ్యూహంలో భాగంగా కేంద్రమంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

# పెళ్లికి ముందు శారీరక సంబంధం నేరం కాదు

న్యూఢిల్లీ ఇద్దరు మేజర్లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ముందే శారీరక సంబంధం పెట్టుకుంటే దాని ఆధారంగా వారి ప్రవర్తన లేదా క్యారెక్టర్‌ను తప్పుబట్టలేమని సుప్రీంకోర్టు సంచలన తీర్పునిచ్చింది. పరస్పర అంగీకారంతో సాగిన ఇలాంటి సంబంధాలను చట్టం ఏమాత్రం నిషేధించలేదని స్పష్టం చేసింది. తెలంగాణకు చెందిన గాజుల తిరుపతి అనే అభ్యర్థి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడంటూ 2014లో అతనిపై ఓ యువతి క్రిమినల్ కేసు పెట్టింది. ఆ తర్వాత 2015లో లోక్ అదాలత్ ద్వారా ఇరువర్గాలు రాజీకొచ్చాయి. ఈ పాత కేసును కారణం చూపిస్తూ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ అతని ఉద్యోగాన్ని రద్దు చేసింది. దీనిపై సదరు అభ్యర్థి సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఈ కేసును విచారించిన జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం పోలీసు బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబట్టింది. మారుతున్న సామాజిక పరిస్థితుల్లో పెళ్లికి ముందే ప్రేమించుకోవడం, శారీరక సంబంధాలు కలిగి ఉండటం సాధారణంగా మారిందని కోర్టు వ్యాఖ్యానించింది. ఇష్టపూర్వకంగా కలిసి ఉన్నంత మాత్రాన, ఆ తర్వాత వారు పెళ్లి చేసుకోలేదనే ఒకే ఒక్క కారణంతో ఒకరు మరొకరిని మోసం చేశారని అనుకోలేమని స్పష్టం చేసింది. ప్రతి ప్రేమకథా పెళ్లితోనే ముగియాలని నియమం ఏమీ లేదని ధర్మాసనం పేర్కొంది. లోక్ అదాలత్‌లో కేసు రాజీపడినంత మాత్రాన అభ్యర్థి తన తప్పును ఒప్పుకొన్నట్లు కాదని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. బాధితురాలే స్వయంగా కేసును వెనక్కి తీసుకుని రాజీపడినప్పుడు సదరు అభ్యర్థి క్యారెక్టర్ బాలేదంటూ ఉద్యోగానికి అనర్హుడిని చేయడానికి పోలీస్ బోర్డుకు ఎలాంటి హక్కు లేదని తేల్చిచెప్పింది. కేవలం విఫలమైన ప్రేమ బంధాన్ని సాకుగా చూపి ఉద్యోగం నిరాకరించడం పూర్తిగా అన్యాయమని కోర్టు పేర్కొంది. చివరికి సుప్రీంకోర్టు తెలంగాణ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇచ్చిన రద్దు ఉత్తర్వులను పూర్తిగా కొట్టివేసింది. సదరు అభ్యర్థిని వెంటనే విధుల్లోకి తీసుకుని, తదుపరి బ్యాచ్ కానిస్టేబుళ్లతో పాటు శిక్షణకు పంపాలని ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు పునరుద్ధరించింది.

# 17వ వార్డులో ప్రజా పాలన

## - ప్రగతి ప్రణాళిక వార్డు సభ


- ముఖ్య అతిథిగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు
- మహిళల భద్రత, షీ టీమ్స్ సేవలపై అవగాహన కల్పించిన పోలీసులు




**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు రైతు వేదిక వద్ద సోమవారం ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి నర్సింగరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, షీ టీమ్ స్పెషల్ పోలీస్ కానిస్టేబుళ్లు మహేష్, ఆంజనేయులు, పురపాలక సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మాబాయి నర్సింగరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వార్డు సభల్లో ప్రజలు చురుకుగా పాల్గొని తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడం అభినందనీయమన్నారు. సభలో స్థానికులు సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలు, నివాస ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం షీ టీమ్ ప్రతినిధులు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మహిళల రక్షణ కోసం తెలంగాణలో 2014లో షీ టీమ్స్ ఏర్పాటు చేయబడిన విషయాన్ని గుర్తు చేస్తూ, మహిళలు సురక్షితమైన వాతావరణంలో జీవించేందుకు ఈ వ్యవస్థ నిరంతరం పనిచేస్తోందన్నారు. ప్రజా ప్రదేశాల్లో మహిళలను వేధించే వారిపై షీ టీమ్స్ కఠిన చర్యలు తీసుకుంటాయని, బాధితులకు అండగా నిలిచి న్యాయం అందిస్తామని తెలిపారు. ఇటీవల కొంతమంది యువకులు బైక్ రేసింగ్‌లు, మద్యపానం, గంజాయి వంటి వ్యసనాలకు బానిసై అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అలాంటి వారిని గుర్తించి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి మార్పు తీసుకురావడానికి షీ టీమ్స్ కృషి చేస్తున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పురపాలక శాఖ సిబ్బంది, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# దరఖాస్తులు స్వీకరించడమే కాదు.. సమస్యలకూ వెంటనే పరిష్కారం చూపాలి

## - 20వ వార్డు సభలో కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ డిమాండ్



గజ్వేల్(ప్రశ్న న్యూస్) ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించడం మాత్రమే కాకుండా, వాటికి సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని 20వ వార్డు కౌన్సిలర్ అత్తిలి శ్రీనివాస్ కోరారు. గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో సోమవారం నిర్వహించిన ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక వార్డు సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందడం లేదని, ప్రజల సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వార్డు పరిధిలో ఆర్టీసీ బస్టాండ్, సమీకృత కూరగాయల మార్కెట్, మసీదు వంటి ముఖ్య ప్రాంతాలు ఉన్నప్పటికీ పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. అధికారిక కార్యక్రమాల ఫ్లెక్సీలలో స్థానిక ఎమ్మెల్యే, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫొటోను ఏర్పాటు చేయకపోవడాన్ని ఖండించారు. తెలంగాణ అభివృద్ధికి దోహదపడిన కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల అమలులో కూడా అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. మున్సిపల్ శాఖ అధికారులు రాహిల్ పాషా, తాహెర్ అలీ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా కార్యాలయ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మధ్యవర్తులను ఆశ్రయించకుండా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలు తమ సమస్యలను అధికారుల ముందు ఉంచారు. గత 20 ఏళ్లుగా అద్దె ఇళ్లలో నివసిస్తున్నప్పటికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధి అందలేదని వాపోయారు. గతంలో అనర్హులకు ఇళ్లు కేటాయించారని ఆరోపిస్తూ, నిజమైన అర్హులను గుర్తించి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. వార్డు సభలో ప్రజల నుంచి పలు దరఖాస్తులను అధికారులు స్వీకరించారు.

# పెంచిన ఎరువులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి

## - నిరసన వ్యక్తం చేసిన ఏ.పి.రైతు సంఘం, సిపిఎం, సిపిఐ నాయకులు




**ఆళ్లగడ్డ:** కేంద్ర ప్రభుత్వం పెంచిన ఎరువులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను వ్యతిరేకిస్తూ సిపిఎం, సిపిఐ పార్టీలు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ నాలుగు రోడ్ల కూడలి లో నిరసన వ్యక్తం చేశారు. సిపిఎం జిల్లా నాయకులు టి. రామచంద్రుడు, సిపిఐ ఆళ్లగడ్డ నాయకులు భాస్కర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు శంకర్ తదితరుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ నాయకులు ఐజయ్య, రామ సుబ్బారెడ్డి పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు టి. రామచంద్రుడు మరియు సిపిఐ నాయకులు భాస్కర్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం పెట్రోల్ ,డీజిల్ ధర లీటరు కు 8 రూపాయలు, వంట గ్యాస్ ధర 29 రూపాయలు, ఎరువుల బస్తా పై 150 నుండి 600 రూపాయల వరకు పెంచి ప్రజానీకం వాడే నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలకు, మరియు రైతుల సేద్యపుఖర్చులు విపరీతంగా పెరగడానికి కారణం అయిందని విమర్శించారు.

ఫలితంగా ఆటో కార్మికులు, కార్మికులు, రైతులు, కూలీలు ప్రజలందరి పైన పెరిగిన ధరల భారం మోపిందని అందుకు యుద్ధం సాకుగా చూపుతున్నదన్నారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు అయినా వెంటనే మోడీ అన్ని ధరలు పెంచి ప్రజలందరినీ మోసం చేశాడన్నారు. రష్యా దేశం తక్కువ ధరకే చమురు దిగుమతి చేస్తామన్న వినకుండా అధిక ధరకు అమెరికాతో కొనుగోలు చేసుకోవడం, వ్యవసాయ ఉత్పత్తులు అమెరికా నుండి దిగుమతి చేసుకునే విధంగా ఒప్పందాలు చేసుకోవడం చూస్తుంటే మన ప్రధాని మోడీ అమెరికా దేశ అధ్యక్షుడు ట్రంపుకి పూర్తిగా లొంగిపోయారన్నారు. వారి వ్యాపార ప్రయోజనాల కోసం, మనదేశంలోని ఆదాని అంబానీ లాంటి కార్పోరేట్ కంపెనీల లాభాల కోసం మన దేశ ప్రజలపై భారాలు వేస్తున్నారన్నారు. ఇప్పటికే పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకుంటున్న మన దేశ రైతులకు నష్టం కలిగే విధంగా అమెరికా నుండి మొక్కజొన్నలు, పండ్లు, పాలు, పత్తి మొదలగు పంటలు ఎలాంటి సుంకాలు లేకుండా దిగుమతి చేసుకొనుటకు, మన దేశ పంటల్ని ఎగుమతి చేయాలంటే విపరీతంగా సుంకం చెల్లించే విధంగా వాణిజ్య ఒప్పందాలు చేసుకోవడం మన దేశ రైతులని మోసం చేయడమే అన్నారు. మూలిగే నక్కపై తాటికాయ పడ్డ చందంగా మళ్లీ ఎరువుల భారం మోపడం దుర్మార్గమని, సబ్సిడీ ఎరువుల బాధ్యత నుండి క్రమంగా తప్పించుకునేందుకు కొత్తగా యాప్ ద్వారా ఎరువులు పంపిణీ విధానం తీసుకొస్తున్నాడని అందువల్ల చాలామంది రైతులకు మరియు కౌలు రైతులకు, సెల్ లేనటువంటి వారికి ఎరువులు దొరకకుండా పోయే పరిస్థితి వస్తుందన్నారు. అలాగే పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల వల్ల పెద్దస్తమానం ఆటో తోలినా పెట్రోల్ డీజిల్ కి సరిపోక ఆటో కార్మికుల కుటుంబాలు గడవడం కష్టమవుతుందన్నారు. సేద్యంలో ట్రాక్టర్ ఖర్చులు, కోత యంత్రాల ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి అన్నారు. ఇంత జరుగుతున్న రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం మాటకైనా కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించకపోవడం, పెరిగిన ఎరువుల ధరలపై మాట్లాడకపోవడం, తూచ తప్పకుండా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను అమలు జరపడం చూస్తుంటే కేంద్రం, రాష్ట్రం రెండు కలిసి రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తున్నాయన్నారు. కావున ప్రజలు ఐకమత్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన ధరలకు వ్యతిరేకంగా మంగళవారం జిల్లా కేంద్రాల్లో జరగబోవు రాస్తారోకో కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రుద్రవరం మండల కమిటీ అధ్యక్షులు గురెడ్డి, కార్యదర్శి కేశవులు, నాయకులు సుధాకర్, సుబ్బరాయుడు, మద్దిలేటి ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## కౌతాళంలో న్యూ గోల్డెన్ బేకరీ ప్రారంభం



**కౌతాళం** కౌతాళం లో కొత్తగా గోల్డెన్ బేకరీ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా సిఐ యుగంధర్ రిబ్బన్ కట్ చేసి షాప్ ను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ చక్కనైన నాణ్యమైన రుచులు అందించాలని బేకరీ షాపులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు. ఈగలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బేకరీ యజమాని కు సూచించారు.కొత్త గా ఓపెన్ అయిన బేకరీ షాప్ కు పలువురు నాయకులు కు శాలువా కప్పి స్వీట్లు అందించారు.అనంతరం బేకరీ షాప్ కు వచ్చిన గ్రామ ప్రజలు కు వారికి చాక్లెట్స్ కేక్ పంచిపెట్టారు.

## రాజ్యసభకు నామినేషన్లు

**అమరావతి,** రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా తెలుగు దేశం పార్టీ తరుపున సానా సతీష్, బాష్యం రామకృష్ణ, చింతకాయల విజయ్ లు నామినేషన్ లు దాఖలు చేశారు. సోమవారం అమరావతి అసెంబ్లీ భవనంలో సానా సతీష్,బాష్యం రామకృష్ణ,చింతకాయల విజయ్ లు తమ నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్. వనితా రాణికి అందచేశారు.

## కామారెడ్డిలో యూరియా కష్టాలు

**కామారెడ్డి** కామారెడ్డి జిల్లాలో రైతులు యూరియా దొరకక ఇబ్బంది పడుతున్నారు. యాప్ విధానం ద్వారా యూరియాను బుక్ చేసుకోవడం కష్టమవుతుందంటూ సొసైటీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. యూరియాను యాప్ విధానం ద్వారా అందించడం రద్దుచేసి మ్యానువల్ పద్ధతిలో అందించాలని రైతుల డిమాండ్. సదాశివ నగర్ మండలం పద్మా జీవాడి ఎక్స్ రోడ్ సొసైటీ ముందు ఆందోళనకు దిగారు. యూరియా బ్లాక్ మార్కెట్లకు తరలిపోతుందని, కాంగ్రెస్ నాయకులకు కనుసన్నల్లోనే యూరియా అందజేస్తున్నారని సొసైటీ ముందు నిరసన తెలిపారు. సదాశివ నగర్ మండలంలో ఏ ఒక్క సొసైటీలో యూరియా దొరకడంలేదు. బాన్సువాడ నియోజకవర్గంలోని నరసుర్లాబాద్, బీర్కూర్ మండలంలోని రైతులకు దొరకడంలేదు. మహారాష్ట్రలోని దెగ్లూరు నుండి యూరియాను రైతులు బ్లాక్ మార్కెట్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు.

## కోరుట్లలో కనిపించకుండా పోయిన యువకుడి కేసులో విషాదాంతం

**- తన కొడుకు ఎక్కడున్నాడో తెలిస్తే చెప్పండి అంటూ తల్లి ఆవేదన**



**కోరుట్ల** కోరుట్లలో కనిపించకుండా పోయిన యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం ఐలాపూర్ గ్రామం నుండి అంకం రాహుల్ అనే యువకుడు వచ్చి సైదాబాద్ మాతృశ్రీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. గత నెల 27వ తేదీన టూర్కు వెళ్తున్నానని చెప్పి కాచిగూడలో ఎంఎంటీఎస్ రైలు ఎక్కి, సికింద్రాబాద్ నుండి శబరి ఎక్స్ప్రెస్లో ఒంగోలు పరిధిలోని సింగరాయకొండ చేరుకుని అక్కడ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 30వ తేదీన గుర్తుతెలియని వ్యక్తిగా సింగరాయకొండ పోలీసులు కేసు నమోదు చేసారు. 31వ తేదీన మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా, సింగరాయకొండలో రైలు దిగి ఆత్మహత్యకు పాల్పడినట్టు కాచిగూడ పోలీసులు గుర్తించారు.

## 2015 నుండి ఈరోజు వరకు కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించడంలేదు

**- బీఆర్ఎస్ క్రిశాంక్**

**హైదరాబాద్** హిట్లర్ నాకు స్ఫూర్తి అని రేవంత్ రెడ్డి చెబుతున్నాడు. హిట్లర్ హంతక బృందం స్ఫూర్తితోనే హైడ్రాను ఏర్పాటు చేసానని చెప్పాడు. ఇరాన్, ఇజ్రాయెల్ యుద్ధంతో పేదల ఇళ్ల కూల్చివేతలను పోల్చుతున్నాడని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి క్రిశాంక్ ఆరోపించారు. హిట్లర్ చేసిన తప్పులకు జర్మనీ ప్రజలు ఇప్పటికీ క్షమాపణ చెబుతూనే ఉన్నారు.. అలాంటి వ్యక్తి రేవంత్ రెడ్డికి స్ఫూర్తి అంట? ఇవాళ దాన్ని ప్రశ్నించినందుకు కేసులు పెడుతున్నారు. మాట్లాడింది రేవంత్ రెడ్డి అయితే మా మీద కేసులు ఏంది.. కేసు వేయాల్సింది రేవంత్ రెడ్డి మీద కదా? ట్వీట్ చేసిన వాళ్ల మీద కేసు పెడితే ఎక్స్ వాళ్ళు వాళ్లకు సమాచారం ఇవ్వొద్దని పోలీసులు నోటీసులో పేర్కొన్నారు.. సమాచారం ఇస్తే దేశం వదిలి పారిపోతాం అంట. ఇది కాదా అసలైన హిట్లర్ పాలన అని ప్రశ్నించారు.బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్కు వ్యతిరేకంగా సొంత పార్టీకి చెందిన మరో ఎంపీ బ్యానర్లు కట్టిస్తున్నాడు. 2015 నుండి ఈరోజు వరకు కంటోన్మెంట్ ఎన్నికలు నిర్వహించలేదు. అప్పటి నుండి బీజేపీ నామినేటెడ్ సభ్యులను నియమిస్తుంది, ఈరోజు వారిలో వారే గొడవలు పడుతున్నారు. మా కంటోన్మెంట్ అంటే ఎందుకు ఇంత నిర్లక్ష్యం ఈటెల రాజేందర్ గారని నిలదీసారు.

## మద్యం మత్తులో తెలుగు తమ్ముళ్ల వీరంగం

**కుప్పం** కుప్పంలో మద్యం మత్తులో తెలుగు తమ్ముళ్లు వీరంగం సృష్టించారు. ప్యాలస్ రోడ్డులో ఉన్న నాయుడు రెస్టారెంట్ ఎదుట ఓ వ్యక్తిని చితకబాదారు.. మద్యం మత్తులో ఓ వ్యక్తి పై నలుగురు యువకులు దాడి చేసారు. రోడ్డు పక్కన పార్కింగ్ చేసిన ఓ కారును యువకుటు మరో కారుతో టచ్ చేసారు. దీంతో కారు దెబ్బతిందని కారులో వచ్చిన యువకులకు కారు యజమాని చెప్పాడు.దీంతో ఆగ్రహించిన యువకులు వ్యక్తిపై దాడికి దిగారు. ఈ ఘర్షణలో కుప్పం మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ సురేష్ కుమారుడు, తదితరులు వున్నట్లు సమాచారం. కారు వార్డు కౌన్సిలర్ సురేష్ కు చెందినది సమాచారం

## అమరావతిలో రూ.200 కోట్లతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం



**అమరావతి** ఏపీ రాజధాని అమరావతిలో రూ.200 కోట్ల వ్యయంతో ఆప్కాబ్ ఐకానిక్ భవనం నిర్మాణం శరవేగంగా సాగుతోంది. లింగాయపాలెంలో 0.495 ఎకరాల్లో జీ+17 అంతస్తులతో,హెలిప్యాడ్తో సహా 2.09 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. ఆప్కాబ్ అక్షరాలు ప్రతిబింబించేలా ఈ డిజైన్ ను రూపొందించారు. భవన నిర్మాణ బాధ్యతలను ఏపీఐఐసీకి అప్పగించగా, ఐఐటీ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ సాంకేతిక సహకారాన్ని అందిస్తున్నాయి.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**- 26 ఫిర్యాదులు స్వీకరణ: - జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**



**రాజన్న సిరిసిల్ల** ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు సోమవారం రోజు నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ మహేష్ బి గీతే తెలిపారు

## ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజావాణి

**- జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్**



**సిద్దిపేట** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం ద్వారా ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులను అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ స్వీకరించారు. వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజావాణిలో అర్జీలు మొత్తం 188 వచ్చాయి. అర్జీదారులకు న్యాయం చేసి తిరిగి అర్జీ పెట్టుకోకుండా పని చెయ్యాలని అధికారులను ఆదేశించారు.ఇట్టి కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, ఎస్డిసి వరలక్ష్మి జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నా

## బద్వేలు నియోజకవర్గంలో డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి సుడిగాలి పర్యటనలు

**- పలువురు టిడిపి నాయకులను కలుస్తున్న సూర్యనారాయణ రెడ్డి**

**బద్వేలు** బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో డిసిసిబి చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు బద్వేలు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జిగా సూర్యనారాయణ రెడ్డి పేరు దాదాపు ఖరారు కావడంతో అన్ని మండలాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులను కార్యకర్తలను కలుసుకుంటున్నారు

బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ మరింత బలంగా ఉండడం కోసం ఆయన ఈ పర్యటనలు మొదలుపెట్టారు అందులో భాగంగా పోరుమామిళ్ళలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి యనమల సుధాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసిన డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి బద్వేల్ నియోజకవర్గం,పోరుమామిళ్ళ పట్టణంలోని వారి నివాసంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మాజీ సర్పంచ్ యనమల సుధాకర్ ని ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలపై వారు సుదీర్ఘంగా చర్చించారు.

ప్రజలకు మరింత చేరువగా ఉంటూ పార్టీ ఆశయాలను బలోపేతం చేయడంతో పాటు సంక్షేమ కార్యక్ర ొమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు. అనంతరం పార్టీ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయాల ని నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.ఇంకా పలువురు టిడిపి నాయకులు కలిశారు పార్టీ కోసం మరింత కష్టపడి ముందుకు పోతామని వచ్చే ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేసి బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ జెండా ఎవరు వేస్తామని సూర్యనారాయణ రెడ్డి వారిని కోరారు

## నక్ష సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలి

**- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**

**- వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**- హాజరైన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల** నక్ష (నేషనల్ జియో స్పాషియల్ నాలెడ్జ్ బేస్డ్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హాబీటెషన్స్) సర్వే ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆదేశించారు. " నక్ష " సర్వే పురోగతి తదితర అంశాలపై వివిధ జిల్లాల కలెక్టర్లతో సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించగా, జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు. ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎస్ మాట్లాడి.. సర్వే ఎక్కడి వరకు పూర్తి చేశారో ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ.. కేంద్ర సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో నక్ష కింద దేశంలోని 150 అర్బన్ లోకల్ బాడీస్ ను ఎంపిక చేశారని వెల్లడించారు. రాష్ట్రంలోని 10 మున్సిపాలిటీలు ఎంపిక చేశారని తెలిపారు. జూలై నెలాఖారులోగా మొత్తం సర్వే ప్రక్రియ ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా పూర్తి చేయాలని ఆదేశించారు.

### పకడ్బందీగా పూర్తి చేయిస్తాం

వేములవాడ మున్సిపల్ పరిధిలో నక్ష కార్యక్రమం కింద ఐదు విలీన గ్రామాల్లో కలిపి మొత్తం 307 బ్లాక్స్ ఉన్నాయని, ఇప్పటివరకు 49 పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. 14, 984 ఇండ్లు ఉండగా, 6707 ఇండ్ల సర్వే పూర్తి అయిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రతి ఒక్క ఇంటి సరిహద్దులు, ప్రభుత్వ, ప్రైవేటు భవనాలు, ఇతర ఖాళీ స్థలాల విస్తీర్ణం వివరాలు పకడ్బందీగా పూర్తి చేయిస్తామని వివరించారు.కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వే శ్రీనివాస్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, టీపీఓ అన్సార్ తదితరులు ఉన్నారు

# సేమ్ సెంటర్... సేమ్ ప్లేస్...

## ఎటాక్ మోడ్‌లో గులాబీ దళం

**వరంగల్** వచ్చే అసెంబ్లీ ఎన్నికల కోసం ప్లాన్ చేస్తోంది బీఆర్ఎస్. ఆ ఊపులోనే. అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేందుకు పావులు కదుపుతోంది. అందుకోసం ఎన్నికల ప్రచారంలో హస్తం నేతలు ఇచ్చిన హామీలు, గ్యారంటీలనే అస్త్రాలుగా వాడాలనుకుంటోందట. అసెంబ్లీ ఎలక్షన్స్‌కు ముందు కాంగ్రెస్ నేతలు రకరకాల డిక్లరేషన్స్ ప్రకటించగా. ఇప్పుడు వాటి అమలు కోసం వత్తిడి చేయడంతో పాటు చేయకుంటే ప్రజల్లోకి వెళ్ళి ఉద్యమ రూపం తీసుకువచ్చేందుకు ప్లానింగ్ జరుగుతున్నట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎక్కడైతే డిక్లరేషన్స్ ప్రకటించిందో ఇప్పుడు అదే ప్రాంతాలకు అక్కడి నుంచే సమరానికి సై అంటోంది గులాబీ దళం. రెండు నెలల క్రితం వరంగల్‌లో రైతు డిక్లరేషన్ సభను అలాగే నిర్వహించింది. ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ అక్కడే రైతు డిక్లరేషన్‌ను ప్రకటించింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రులు, సీనియర్ నేతలందరూ హాజరైన ఈ సమావేశం బాగా సక్సెస్ అయిందనట్టు బీఆర్ఎస్ భావిస్తోంది. అయితే అదే ఊపుతో నెలకో సభ పెట్టి?దూకుడుగా ముందుకు వెళ్ళాలని అనుకున్నా ఆ పని జరగలేదు. ఊపు వచ్చాక ఒక్కసారిగా పార్టీ పెద్దలు ఎందుకు ఆగారో అర్ధంగాక కింది స్థాయిలో బుర్ర గోక్కుంటున్నారు. రైతుల తర్వాత వెంటనే కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ మీద పోరాటం చేయాలని భావించింది బీఆర్ఎస్. ఈ నెలలో ఆ సభ నిర్వహిస్తారని మొదట చెప్పినా. ఒక్కసారిగా సైలెంట్ అయ్యారు. అలా ఎందుకంటే ప్లానింగ్ మారింది, డిఫరెంట్‌గా ఉండబోతోందన్నది పార్టీ వర్గాల ఆన్సర్. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం చేయడానికి తమ దగ్గర ఉన్న ప్రధాన ఆయుధం వారిచ్చిన హామీలు, గ్యారంటీలే అన్నది బీఆర్ఎస్ భావన. వాటిని అమలు చేయలేదని నిరూపించడమే తమకు ప్రధానం అంటున్నారు గులాబీ సీనియర్స్. అలాంటి ఆయుధాన్ని వెంట వెంటనే వాడేస్తే ఎన్నికల నాటికి వాడకం కోసం ఏమీ మిగలవని, అధికార కాంగ్రెస్‌పై పోరాటానికి వీటిని పద్ధతిగా వాడాలని డిసైడయ్యారట. మొత్తాన్ని ఒకేసారి ఉపయోగించకుండా మెల్లిగా, టైం చూసి ఒక్కొక్క అస్త్రాన్ని బయటికి తీసి ప్రభుత్వం మీద ప్రయోగించాలనుకుంటున్నట్టు సమాచారం. యూత్ డిక్లరేషన్‌పై పోరాటాన్ని వాయిదా వేసుకున్నట్టు తెలుస్తోంది. ఒక డిక్లరేషన్‌పై పోరాట సభకు, మరో దానికి మధ్య కనీసం ఆరు నెలల గ్యాప్ ఉంటే బాగుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నారట. అందుకోసమే రైతు డిక్లరేషన్ పై పోరాటం సక్సెస్ అయిన ఈ సమయంలో వచ్చే ఐదారు నెలలు దాని గురించే మాట్లాడుకునేలా చేసి అదే అంశాన్ని జనాల్లోకి తీసుకెళ్లాలని.. తర్వాత యూత్ డిక్లరేషన్, దాని తర్వాత బీసీ డిక్లరేషన్ లాంటి అంశాలను తీసుకోవాలనుకుంటున్నట్టు సమాచారం. ముందు ఒక కార్యక్రమం చేసి ఆ హీట్ తగ్గకుండా జాగ్రత్తపడుతూ అది కాస్త తగ్గుతుందనుకున్నప్పుడు మరో అస్త్రాన్ని బయటికి తీసి ఆ టెంపోని అలాగే మెయిన్‌టెయిన్ చేయాలనుకుంటున్నట్టు సమాచారం. ప్రతిపక్ష పార్టీగా. ప్రభుత్వం మీద పోరాటానికి కలిసి వచ్చే ఏ అవకాశాన్ని వదులుకోకూడదన్నది బీఆర్ఎస్ భావన. ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ళ సమయం ఉన్నందున ఆరు నెలలకో పెద్ద బహిరంగ సభ పెట్టి డిక్లరేషన్స్ మీద పోరాటాలకు సిద్ధమవుతోంది కారు పార్టీ. దాన్ని అలా కొనసాగిస్తే? ఎన్నికల నాటికి బాగా ఉపయోగపడుతుందని లెక్కేలేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో నెల్లూరు జిల్లా యాత్రికుల మృతిపై హోం మంత్రి అనిత తీవ్రగ్భ్రాంతి

**విశాఖపట్నం** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు భక్తులు మృతి చెందడం పట్ల హోం మంత్రి అనిత తీవ్ర గ్భ్రాంతి వ్యక్తం చేసారు. పుణ్యక్షేత్రాల దర్శనానికి బయలుదేరిన ప్రైవేటు బస్సు ప్రమాదానికి గురై ముగ్గురు ప్రాణాలు కోల్పోవడం విషాదకరం. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసారు. గాయపడిన యాత్రికులతో ఫోన్లో మాట్లాడారు. గాయాలైన యాత్రికులకు ధైర్యం చెప్పారు. గాయపడిన యాత్రికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. యాత్రికులు స్వస్థలాలకు చేరేలా ఏర్పాటు చేస్తున్నాం. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు. ప్రమాదానికి గురైన యాత్రికుల పరిస్థితిపై ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తూ, సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని హోం మంత్రి అనిత ఆదేశించారు.

## గుంటూరు కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో యువతి ఆత్మ హత్య యత్నం

బాబాయ్ నాగార్జున వేధింపులు తాళలేక గ్రీవెన్స్ లోని పురుగుల మందు సేవించిన యువతి . విషయం... తెలుసుకున్న డిస్టిక్ రెవెన్యూ ఆఫీసర్ మరియు పోలీసు సిబ్బంది హుటాహుటిన బాధితురాలను జిజిహెచ్ కి తరలించారు. బాబాయ్ నాగార్జున.. తన ఇల్లు,పొలం తాలూకా 5 లక్షల రూపాయలు తన వద్ద పెట్టుకొని ఇవ్వకుండా వేదిస్తున్నాడని సమాచారం. తన చదువు నిమిత్తం కాలేజీ ఫీజు కట్టాలని బాబాయిని, నాయనమ్మని అడగగా వారు ఫీజు కట్టడానికి నిరాకరించారు. పైగా..ఆడదానికి చదివు ఎందుకని అనడంతో బాధితురాలు పురుగుమందు సేవించిందని తెలియవచ్చింది. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉందని సమాచారం.

# పేటలో రోడ్డు ప్రమాదం

### - నలుగురికి గాయాలు

**చిలకలూరిపేట** కావూరు, కోమటినేనివారిపాలెం గ్రామాల మధ్య సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. నరసరావుపేట నుంచి రాజమండ్రి వైపు నలుగురు వ్యక్తులతో వెళ్తున్న ఒక కారు, అతివేగం కారణంగా అదుపుతప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న నలుగురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదంపై సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది వాహనంతో ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు. కారు మితిమీరిన వేగంతో వెళ్లడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు చెబుతున్నారు.

## బంజారాహిల్స్‌లో

# అగ్నిప్రమాదం..

### - ఇంట్లో పేలిన ఫ్రిడ్జ్

**హైదరాబా** బంజారాహిల్స్ లోని ఉదయ్ నగర్ బస్తీలో సోమవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. బస్తిలోని అమర్ సింగ్ అనే వ్యక్తి నివాసంలో ఫ్రిడ్జ్ పేలడంతో ఈ అగ్నిప్రమాదం సంభవించినట్లు ఫైర్ అధికారులు గుర్తించారు. ఈ ప్రమాదంతో ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిపోయాయి, వస్తువులతో పాటు అమర్ సింగ్ కుటుంబం సంపాదించిన డబ్బులు సుమారు 50 వేల వరకు ఖాళీ బూడిద అయినట్లు వారు ఆవేదన వ్యక్తీ చేశారు. రెవెన్యూ అధికారులు పంచనామా చేసారు.

# భారీ నష్టాల్లో సూచీలు..

### - 700 పాయింట్లకు పైగా పతనమైన సెన్సెక్స్

**ముంబైజూన్** పశ్చిమ ఆసియాలో నెలకొన్న తాజా ఉద్రిక్తతలు భారత స్టాక్ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. సోమవారం ట్రేడింగ్‌లో దేశీయ సూచీలు భారీ నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వెలువడిన ప్రతికూల సంకేతాలకు తోడు ముడిచమురు ధరలు పెరగడంతో మదుపర్లు అమ్మకాలకు మొగ్గు చూపారు. ఫలితంగా, బీఎస్ఈ సెన్సెక్స్ 719.08 పాయింట్లు పతనమై 73,524.26 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 243.70 పాయింట్లు క్షీణించి 23,123 వద్ద స్థిరపడింది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ క్షిపణి దాడులకు దిగడం, దానికి ప్రతిగా ఇజ్రాయెల్ సైతం వైమానిక దాడులతో విరుచుకుపడటంతో పశ్చిమ ఆసియాలో మరోసారి యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఈ పరిణామాల వల్ల అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ ధరలు పెరగడం, భారత్ వంటి ముడిచమురు దిగుమతులపై ఎక్కువగా ఆధారపడే దేశాలలో ద్రవ్యోల్బణం భయాలను పెంచుతోంది. మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి అన్ని రంగాల్లోనూ ప్రస్ఫుటంగా కనిపించింది. ప్రధానంగా రియల్టీ, మెటల్, ఆటో రంగాల షేర్లు భారీగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు సైతం 1.66 శాతం నుంచి 2.88 శాతం వరకు పతనమయ్యాయి. మరోవైపు, ఇరాన్‌కు ప్రయాణాలను నిలిపివేయాలని, అక్కడ ఉన్న భారతీయులు తక్షణమే స్వదేశానికి తిరిగి రావాలని కేంద్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అంతర్జాతీయంగా నెలకొన్న ఈ అనిశ్చితి కారణంగా మార్కెట్లలో అమ్మకాల ఒత్తిడి మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బద్వేలు తెలుగుదేశం పార్టీ ఇన్చార్జిగా

# మంచూరు సూర్యనారాయణ రెడ్డి?

- టిడిపి ఇన్చార్జి రితేష్ రెడ్డికి మంగళం - ఇదే బాటలో మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు కూడా జరుగుతున్న ప్రణామాలు చూస్తుంటే నిజమే అనిపిస్తుంది
- బాధ్యతల నుంచి విజయమ్మ రితేష్ రెడ్డిల తొలగింపు - టిడిపి అధిష్టానం లో శరవేగంగా కదులుతున్న పావులు
- ఏ అధికార కార్యక్రమం అయినా చైర్మన్ ఆధ్వర్యంలోనేసూర్యనారాయణ రెడ్డి డిసిసిబి చైర్మన్గా - బాధ్యతలు చేపట్టి జూన్ 7 నాటికి సంవత్సరం



**బద్వేలు** బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో మాజీ మంత్రి బిజీ వేముల వీరారెడ్డి వారసత్వానికి బ్రేకులు పడ్డాయా ? నియోజకవర్గ ఇన్చార్జి రితేష్,రెడ్డిని అతని తల్లి మాజీ ఎమ్మెల్యే విజయమ్మను తెలుగుదేశం పార్టీ అధిష్టానం పక్కన పెట్టినట్లు విశ్వసనీయ సమాచారంకడప జిల్లా బద్వేల్ నియోజకవర్గ రాజకీయాలు ప్రస్తుతం అత్యంత ఆసక్తికరంగా మారాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని అధికార తెలుగుదేశం పార్టీ వ్యూహాలు రచిస్తోంది. ఈ క్రమంలో ప్రస్తుత ఇన్ఛార్జ్ రితీష్ రెడ్డిని పక్కన పెట్టి, కొత్త నాయకత్వానికి బాధ్యతలు అప్పగించే యోచనలో అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. వరుస ఓటములతో సతమతమవుతున్న పార్టీని గట్టెక్కించేందుకు డీసీసీబీ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు సమాచారం. గడిచిన ఆరు ఎన్నికలుగా ఎదురవుతున్న పరాజయాలకు చెక్ పెట్టడమే లక్ష్యంగా టీడీపీ అడుగులు వేస్తోంది. రాబోయే వారం రోజుల్లో బద్వేల్ కొత్త ఇన్ఛార్జ్ ఎవరనే దానిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. టీడీపీ కంచుకోటలో వైసీపీ హవాఒకప్పుడు బద్వేల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి బలమైన కోటగా ఉండేది. దివంగత నేత వీరారెడ్డి హయాంలో ఇక్కడ టీడీపీ తిరుగులేని శక్తిగా వెలుగొందింది. అయితే, గత ఆరు ఎన్నికల నుంచి పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. తొలుత కాంగ్రెస్, ఆ తర్వాత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలు ఇక్కడ పాగా వేశాయి. ముఖ్యంగా పులివెందుల తర్వాత బద్వేల్‌ను వైసీపీ తన రెండో కంచుకోటగా మార్చుకుంది. ప్రస్తుతానికి ఇక్కడ వైసీపీ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తుండగా, టీడీపీ తన పూర్వ వైభవాన్ని చాటుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. వరుస పరాజయాలపై అధిష్టానం సీరియస్‌బద్వేల్ నియోజకవర్గంలో వీరారెడ్డి కుటుంబానికి టీడీపీ అధిష్టానం ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తూనే వచ్చింది. ప్రస్తుత ఇన్ఛార్జ్ రితీష్ రెడ్డికి కూడా పార్టీ అండగా నిలిచింది. అంతేకాకుండా, ప్రస్తుత దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి వీరారెడ్డి కుటుంబం దగ్గరి బంధువులు కావడంతో పరోక్షంగా కొంత సానుకూలత ఉంది. అయితే, వరుసగా ఆరు పర్యాయాలు ఓటమి పాలు కావడంతో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని నాయకత్వం ఈసారి కఠిన నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. సానుభూతి కంటే గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇవ్వాలని పార్టీ భావిస్తోంది.మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఎంట్రీప్రస్తుత కడప డీసీసీబీ చైర్మన్, ప్రముఖ రైల్వే కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి పేరు బద్వేల్ రాజకీయాల్లో ప్రముఖంగా వినిపిస్తోంది. గతేడాది చివరలో టీడీపీ నిర్వహించిన ఐవీఆర్ఎస్ సర్వేలో రితీష్ రెడ్డితో పాటు సూర్యనారాయణ రెడ్డి పేరును కూడా ప్రజల ముందుకు తీసుకెళ్లారు. ఈ సర్వేలో సూర్యనారాయణ రెడ్డి వైపు మొగ్గు కనిపించడంతో అధిష్టానం ఆయనకే ఇన్ఛార్జ్ బాధ్యతలు అప్పగించేందుకు దాదాపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆయన పేరు ఖరారైందని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి.నేతల మధ్య పెరిగిన అంతరంకొత్త ఇన్ఛార్జ్ మార్పు వార్తలతో బద్వేల్ టీడీపీలో అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. ఇన్నాళ్లూ కలిసి తిరిగిన రితీష్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డిల మధ్య ఇప్పుడు దూరం పెరిగింది. నియోజకవర్గంలో "రితీష్ రెడ్డి వర్సెస్ సూర్యనారాయణ రెడ్డి" అన్నట్లుగా వర్గ పోరు మొదలైంది. ఒక వర్గం పాత నాయకత్వాన్నే కోరుకుంటుండగా, మెజారిటీ కేడర్ మార్పును కోరుకుంటూ సూర్యనారాయణ రెడ్డి పంచన చేరుతున్నారు. దీంతో సాధారణ కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక అయోమయంలో పడ్డారు.పోటీపడి కార్యక్రమాల నిర్వహణఅధిష్టానం దృష్టిలో పడేందుకు ఇద్దరు నేతలు నియోజకవర్గంలో భారీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. యువతను ఆకట్టుకోవడానికి క్రికెట్ టోర్నమెంట్లు, గ్రామాల్లో ఎడ్లబండి పోటీలు వంటివి ఏర్పాటు చేస్తున్నారు. సంక్రాంతి పండుగ నుంచి ఈ పోటీ మరింత పెరిగింది. అయితే, ఇటీవల అమరావతిలో నారా లోకేష్ నిర్వహించిన ఆత్మీయ విందుకు బద్వేల్ నుంచి ఎవరినీ ఆహ్వానించకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఇది మార్పునకు సంకేతమా లేక వ్యూహాత్మక మౌనమా అన్నది వేచి చూడాలి.త్వరలో అధికారిక ప్రకటనబద్వేల్ కొత్త ఇన్ఛార్జ్ నియామకంపై ఉత్కంఠ త్వరలోనే తొలగిపోనుంది. అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, మరో వారం రోజుల్లోనే టీడీపీ అధిష్టానం నుంచి స్పష్టమైన ప్రకటన రానుంది. మంచూరు సూర్యనారాయణ రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు సమాచారం అందుతుండటంతో ఆయన అనుచరులు ఇప్పటికే సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మార్పు బద్వేల్‌లో టీడీపీకి పూర్వ వైభవం తెస్తుందా లేదా అన్నది చూడాలి.

# ఆంధ్రప్రదేశ్‌లో తొలి క్రియేటర్ ఎకానమీ సమ్మిట్ విజయవంతం

### అమరావతిలో ఘనంగా జరిగిన 'క్రియేటర్స్ జోన్ డిజిటల్ సమ్మిట్ 2026'





అమరావతి, జూన్ 8: భారత్ డిజిటల్ మీడియా ఫెడరేషన్ (భారత్ ఆఓఈ), రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఖీఎఊ), ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ (ంఖమీ) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన "క్రియేటర్స్ జోన్ డిజిటల్ సమ్మిట్ 2026" చినకాకానిలోని ఖీఎఊ ప్రాంగణంలో విజయవంతంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి డిజిటల్ క్రియేటర్లు, ఇన్నోవేటర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విద్యార్థులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమ ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో తొలి క్రియేటర్ ఎకానమీకి అంకితమైన ప్రధాన సదస్సుగా నిలిచిన ఈ కార్యక్రమంలో 200 మందికి పైగా క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు, స్టార్టప్ వ్యవస్థాపకులు, విద్యార్థులు మరియు ఇతర భాగస్వాములు పాల్గొన్నారు. కంటెంట్ సృష్టి, కృత్రిమ మేధస్సు (ంఎ), క్రియేటర్ మోనిటైజేషన్, మేధో సంపత్తి హక్కులు (ఎఖఖీ), బ్రాండ్ భాగస్వామ్యాలు, వ్యవస్థాపకత వంటి అంశాలపై నిపుణులు ప్రత్యేక సెషన్లు నిర్వహించారు. భవిష్యత్ క్రియేటర్ ఎకానమీ అవకాశాలపై చర్చలు, నెట్‌వర్కింగ్ కార్యక్రమాలు కూడా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా నిర్వహించిన "క్రియేటర్స్ జోన్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026" కార్యక్రమంలో డిజిటల్ కంటెంట్, సృజనాత్మకత, సామాజిక ప్రభావం రంగాల్లో విశిష్ట కృషి చేసిన పలువురు డిజిటల్ క్రియేటర్లను సత్కరించారు. ఈ సందర్భంగా భారత్ డిజిటల్ మీడియా ఫెడరేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ విశ్వ అఓ మాట్లాడుతూ, "క్రియేటర్ ఎకానమీ కొత్త ఆవిష్కరణలు, ఉపాధి, వ్యాపార అవకాశాలకు మార్గం సుగమం చేస్తోంది. ఈ సమ్మిట్ ద్వారా క్రియేటర్లకు అవసరమైన జ్ఞానం, పరిశ్రమతో అనుసంధానం, అవకాశాలను అందిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో బలమైన క్రియేటర్ ఎకోసిస్టమ్‌కు పునాది వేయాలనే లక్ష్యంతో ముందుకు వచ్చాము" అన్నారు. భారత్ ఆఓఈ సహ వ్యవస్థాపకులు, ఉపాధ్యక్షులు విపిన్ ఉన్ని మాట్లాడుతూ, "డిజిటల్ యుగంలో క్రియేటర్లే కొత్త తరహా వ్యవస్థాపకులు. క్రియేటివిటీని అవకాశాలతో అనుసంధానం చేస్తూ, కంటెంట్ క్రియేషన్‌ను కెరీర్ క్రియేషన్‌గా మార్చే వేదికను క్రియేటర్స్ జోన్ ద్వారా నిర్మిస్తున్నాము. క్రియేటర్లను శక్తివంతం చేయడం, సమాజాలను బలోపేతం చేయడం, భారత డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు తోడ్పడటం మా లక్ష్యం" అన్నారు. శ్రీమతి ధాత్రి రెడ్డి, , సీఈఓ ంఖమీ మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ (ఖీఎఊ) మాట్లాడుతూ, "భవిష్యత్తు క్రియేటర్లు, ఆవిష్కర్తలు, వ్యవస్థాపకులదే. ప్రతిభను ప్రోత్సహించే, ఆవిష్కరణలను పెంపొందించే వేదికలను నిర్మించడం ఖీఎఊ లక్ష్యం. క్రియేటర్స్ జోన్ ద్వారా యువతకు జ్ఞానం, సాంకేతికత, నెట్‌వర్క్‌లు, అవకాశాలను అందించి డిజిటల్ ఎకానమీలో స్థిరమైన కెరీర్‌లను నిర్మించేందుకు తోడ్పడుతున్నాము" అన్నారు. ట్రూజోన్ సోలార్ బై సన్‌టెక్ సీఈఓ జక్కుల శ్రీనివాస్ మాట్లాడుతూ, "సుస్థిరత ఇప్పుడు ఒక ఎంపిక కాదు, ప్రతి ఒక్కరి బాధ్యత. పర్యావరణహిత శక్తి పరిష్కారాల వైపు దేశం అడుగులు వేస్తున్న ఈ సమయంలో ప్రజల్లో అవగాహన కల్పించడంలో క్రియేటర్ల పాత్ర కీలకం. ఆవిష్కరణ, సాంకేతికత, డిజిటల్ కథనాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే క్రియేటర్స్ జోన్ వంటి కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడం సంతోషంగా ఉంది" అన్నారు. తెనాలి డబుల్ హార్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, "ప్రస్తుత కాలంలో వినియోగదారులు విశ్వసించే వ్యక్తుల కథలు, అనుభవాలు, సూచనల ద్వారా ఉత్పత్తులను తెలుసుకుంటున్నారు. ఆధునిక మార్కెటింగ్‌లో క్రియేటర్ ఎకోసిస్టమ్ కీలక భాగంగా మారింది. వినియోగదారుల ఎంపికలను ప్రభావితం చేస్తూనే తమ స్వంత డిజిటల్ వ్యాపారాలను నిర్మించుకునే క్రియేటర్లను ప్రోత్సహించడం ఎంతో అవసరం" అన్నారు. "గ్రామీణ మూలాల నుంచి డిజిటల్ ప్రపంచం వరకు" అనే ప్రధాన అంశంతో నిర్వహించిన ఈ సమ్మిట్, చిన్న పట్టణాలు మరియు గ్రామీణ ప్రాంతాల యువతకు డిజిటల్ వేదికల ద్వారా విస్తృత అవకాశాలు, మార్కెట్లు, ప్రేక్షకులను చేరుకునే మార్గాలను చర్చించింది. ఆంధ్రప్రదేశ్‌లో క్రియేటర్ ఎకానమీని మరింత బలోపేతం చేయడానికి క్రియేటర్లు, స్టార్టప్‌లు, బ్రాండ్లు, విద్యాసంస్థలు మరియు ప్రభుత్వ భాగస్వాముల మధ్య సహకారాన్ని పెంపొందించే దీర్ఘకాలిక కార్యక్రమాలకు ఈ సమ్మిట్ నాంది పలికిందని నిర్వాహకులు తెలిపారు.

# శ్రీశైలంలో ఘనంగా యోగాంధ్ర కార్యక్రమం

- భారతదేశం ప్రపంచానికి యోగా అనే అమూల్యమైన వరాన్ని అందించింది
- యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యం
- ప్రతిరోజూ యోగా జీవితంలో భాగం చేసుకోవాలి
- జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్



**శ్రీశైలం/ నంద్యాల :** :-భారతదేశం ప్రపంచానికి యోగా అనే అమూల్యమైన వరాన్ని అందించిందని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర?2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీశైలంలో నిర్వహించిన ప్రత్యేక యోగా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ యోగ సాధన ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ యోగాను తమ దైనందిన జీవితంలో భాగం చేసుకుని క్రమం తప్పకుండా ఆచరించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే యోగాంధ్ర కార్యక్రమ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు యోగా కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శ్రీశైలంలో నిర్వహించిన ఈ ప్రత్యేక యోగా కార్యక్రమంలో సుమారు 2,100 మంది పాల్గొని యోగాభ్యాసం చేశారు. కార్యక్రమం కోసం ఆలయ ముఖద్వారం సమీపంలోని గంగాధర మండపం వద్ద ప్రత్యేక వేదికను ఏర్పాటు చేయగా, గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు విస్తృత ఏర్పాట్లు చేశారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ, శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్ల సన్నిధిలో యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. జిల్లా యంత్రాంగం, రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారుల సూచనల మేరకు దేవస్థానం పరిధిలో యోగా కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమం కోసం జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన యోగా గురువులను ఆహ్వానించామని, గత రెండు రోజులుగా సిబ్బంది, స్థానికులు, యాత్రికులకు ప్రత్యేక యోగా శిక్షణ అందించామని చెప్పారు. ఈ నెల 20వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని వెల్లడించారు. యోగ సాధన వల్ల శారీరక, మానసిక సామర్థ్యాలు పెరగడంతో పాటు ఒత్తిడి తగ్గి, ఏకాగ్రత మరియు మానసిక ప్రశాంతత పెరుగుతాయని ఆయన వివరించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు. అనంతరం ప్రముఖ యోగా గురువు గంధవళ్ల బాలసుబ్రహ్మణ్యం సాధకులతో సూక్ష్మ వ్యాయామాలు చేయించి, ప్రణవ ధ్యానం, ప్రాణాయామం నిర్వహించారు. ప్రాణాయామం ప్రాముఖ్యతను వివరిస్తూ వివిధ యోగాసనాలను అభ్యసింపజేశారు.

## సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ చొరవతో

# గంజివాగు తాత్కాలిక రహదారి మరమ్మతు

**- త్వరితగతిన నూతన హై లెవల్ బ్రిడ్జీని ప్రారంభించాలి**

**- స్తంభంపల్లి సర్పంచ్ : బొంగాని అశోక్ గౌడ్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండలం, స్తంభంపల్లి గ్రామ శివారులోని గంజివాగు వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రహదారి ఆదివారం కురిసిన స్వల్ప వర్షానికే బురదమయంగా మారి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించింది. రహదారిపై బురద పేరుకుపోవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించడంలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న స్తంభంపల్లి గ్రామ సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ పాలకవర్గంతో కలిసి తాత్కాలిక రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్డుపై మొరం పోయించి బురదను తొలగించి రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ చొరవతో చేపట్టిన ఈ పనుల వల్ల గ్రామ ప్రజలకు తక్షణ ఉపశమనం లభించింది.

ఈ సందర్భంగా సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ మాట్లాడుతూ, వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా గంజివాగుపై నూతనంగా నిర్మించిన హై లెవల్ బ్రిడ్జిని వీలైనంత త్వరగా ప్రారంభించాలని చొప్పదండి శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యంను కోరారు. బ్రిడ్జి అందుబాటులోకి వస్తే గ్రామ ప్రజలకు, రైతులకు, వాహనదారులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ అక్కెనపల్లి ఉపేందర్, ఉప సర్పంచ్ చంద్రగిరి అశోక్, వార్డు సభ్యులు చంద్రగిరి వెంకటేష్, అక్కనపల్లి మధుకర్, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బీరవెల్లి వెంకటేశ్వరరావు, ఎడపల్లి ప్రభాకర్, చంద్రగిరి గంగయ్య, అక్కనపల్లి రాజయ్య, అక్కనపల్లి రమేష్, కందాడి కిరణ్ రెడ్డి, గంగాదర వెంకటరమణ, కొట్టపల్లి అనిల్, ఎడపల్లి కిషన్, చంద్రగిరి అతీష్, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మీడియా అక్రెడిటేషన్ల జీవో పై హైకోర్టులో వాదనలు

**- ప్రభుత్వ సంజాయిషీ కోరిన కోర్టు**



**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ లకు సంబంధించిన జీవో ఆర్టీ 229 పై దాఖలైన పిటిషన్ పై సోమవారం తెలంగాణ హైకోర్టు లో వాదనలు జరిగాయి. రాష్ట్ర, జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలలో నాలుగు జర్నలిస్టు యూనియన్ లకు బదులు కేవలం మూడు యూనియన్ లకే ప్రాతినిధ్యం ఇచ్చి తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా జీవో 229 ని అమలు చేయడాన్ని సవాల్ చేస్తూ, ఈ జీవోను రద్దు చేయాలని ఏబీఎన్ టీవీ కరస్పాండెంట్ నంబి పర్వతాలు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణకు వచ్చింది. కేసు స్వీకరించిన జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ మొహినుద్దీన్ లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది, ప్రభుత్వ తరపు న్యాయవాదుల మధ్య వాదలు జరిగాయి. మీడియా అక్రెడిటేషన్ కార్డుల జారీ కోసం ఏర్పాటైన జీవో 252 నిబంధనల ప్రకారం అక్రెడిటేషన్ కమిటీలో నాలుగు యూనియన్ లను తీసుకోవాల్సి ఉండగా, అట్టి నిబంధనలను తుంగలో తొక్కి కేవలం మూడు యూనియన్ లతోనే కమిటీ ఏర్పాటు చేసి అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషనర్ తరపు న్యాయవాది రఘు వాదనలు వినిపిస్తూ, జీవో 229 ని రద్దు చేయాలని కోర్టును కోరారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అపరేష్ కుమార్, జస్టిస్ మొహినుద్దీన్ లు ప్రభుత్వ తరపు ప్రత్యేక న్యాయవాదిని సంజాయిషీ అడిగారు. ఈ రిట్ పిటిషన్ కు సంబంధించిన ఫైల్ తనకు అందలేదని ప్రభుత్వ తరపు న్యాయవాది వాదించగా, పిటిషన్ కాపీలు జీపీకి ఇవ్వకుండా కోర్టులో కేసు నెంబర్ నమోదు కావడం అసాధ్యమని పిటిషనర్ న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న కోర్టు కేసును వాయిదా వేసింది.

## మిడ్ మానేరు డ్యామ్‌లో గుర్తు తెలియని మృతదేహం కలకలం



**వేములవాడ (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ రూరల్ మండలం, రుద్రవరం గ్రామం (పాత) పరిధిలోని మిడ్ మానేరు డ్యామ్‌లో గుర్తు తెలియని ఓ పురుషుడి మృతదేహం లభ్యమైంది. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండగా, షర్ట్, టవల్, డ్రాయర్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై వేములవాడ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తించినట్లయితే లేదా సంబంధిత సమాచారం తెలిసి ఉంటే వేములవాడ రూరల్ పోలీసులను సంప్రదించాలని పోలీసులు కోరారు. వివరాలను ఫోన్ నంబర్: 8712656417లో అందించాలని కోరారు.

# ట్రబుల్ షూటర్‌కు వరుస ట్రబుల్స్

**బెంగళూరు** కాంగ్రెస్ పార్టీలో ట్రబుల్ షూటర్ గా పేరు పొందారు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్. ఆర్థికంగా బలవంతుడు. ఆలోచనలో ఉన్నత వంతుడు. పైగా అనేక సంక్షోభాలలో పార్టీని గట్టెక్కించాడు. పైగా సోనియాగాంధీకి అత్యంత నమ్మకమైన వ్యక్తి. అందువల్లే అంతటి సిద్ధరామయ్యను కూడా పక్కనపెట్టి కాంగ్రెస్ పార్టీ డీకే శివకుమార్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చేసింది. శివకుమార్ ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయనకు అంతా కూడా సానుకూలంగా ఉంటుందని.. మంత్రులు.. మిగతా ఎమ్మెల్యేలు మొత్తం సహకరిస్తారని అందరూ అనుకున్నారు. కానీ ఆయన సీఎం పీఠాన్ని అధిష్టించిన ఒక్కరోజు వ్యవధిలోనే కష్టాలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆయన వరుసగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే తన కోరుకున్న శాఖ రాలేదని రామలింగారెడ్డి పదవికి రాజీనామా చేశారు. తన కోరుకున్న శాఖ ఇవ్వలేదని మరో మంత్రి మునియప్ప నిరసన తెలిపారు. తనకు చెప్పకుండా అధికారులను మార్చారని ఇంధన మంత్రి జార్జ్ అసంతృప్తిని వ్యక్తం చేశారు.. పీసీసీ పగ్గాలు తనకు అప్పగించలేదని మరొక మంత్రి సతీష్ అలక పాన్పు ఎక్కారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ దారుణమైన పరాజయాన్ని చవిచూసింది. తమిళనాడులో ఐదు స్థానాలు గెలుచుకున్నప్పటికీ.. విజయ్ పార్టీకి అవసరం కాబట్టి కాంగ్రెస్ పరువు కాస్త నిలబడింది. మిగతా రాష్ట్రాలలో కాంగ్రెస్ పార్టీ దారుణమైన ఫలితాలను చవిచూసింది. ఒకరకంగా చెప్పాలంటే జాతీయ పార్టీ ప్రాంతీయ పార్టీ కంటే హీనంగా మారిపోతుంది. ఒకప్పుడు దేశ రాజకీయాలను మొత్తం శాసించిన హస్తం పార్టీ ఇప్పుడు ఇలా మారిపోవడం కార్యకర్తలకు మింగుడు పడడం లేదు. దక్షిణ భారత దేశంలో కాంగ్రెస్ పార్టీకి అధికారం ఉన్న రాష్ట్రాలలో కర్ణాటక అత్యంత కీలకమైనది. ఈ రాష్ట్రం మీద బిజెపి అధినాయకత్వం ఫోకస్ చేసింది. వచ్చే ఎన్నికల్లో ఎలాగైనా సరే గెలిచి అధికారాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తోంది. వాస్తవానికి బిజెపికి దక్కకుండా కాంగ్రెస్ పార్టీ ఇక్కడ రాజకీయాలు చేయాల్సి ఉండేది. కానీ సిద్ధరామయ్య.. డీకే శివకుమార్ మధ్య ఆధిపత్య పోరు వల్ల కాంగ్రెస్ పార్టీ ఇక్కడ తీవ్రమైన ఇబ్బందులు పడుతోంది. అనేక రకాల చర్చల తర్వాత శివకుమార్ కు ముఖ్యమంత్రి పదవి ఇచ్చినప్పటికీ మంత్రులు బహిరంగం గానే తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం.. రాజీనామా చేయడం వంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఘోరంగా మారుతుంది. అంతటి ట్రబుల్ షూటర్ డీకే కూడా తలనొప్పితో బాధపడుతున్నాడు అంటే కర్ణాటకలో రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

# లద్దాక్‌కు పోటెత్తున్న టూరిస్టులు

**శ్రీనగర్** వేసవిలో టూరిస్టు ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. అయితే మన దేశంలో అందమైన కశ్మీర్‌లోని పహల్గాంలో గతేడాది జరిగిన ఘటనలో పర్యాటకులు కాస్త తగ్గారు. కానీ కేంద్రం, ఆర్మీ తీసుకున్న రక్షణ చర్యలతో ఈ వేసవిలో లద్దాక్‌కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఈ మే నెలలో మొత్తం 72,834 మంది పర్యాటకులు లద్దాక్‌ను సందర్శించారు. గత ఏడాది మే నెలలో 32,927 మంది మాత్రమే వచ్చిన విషయాన్ని పోలిస్తే ఇది 121.2% అద్భుత పెరుగుదల. లద్దాక్ టూరిజం చరిత్రలో ఇది ఒక నిజమైన మైలురాయి. జనవరి నుంచి మే వరకు మొత్తం 1,17,546 మంది సందర్శకులు వచ్చారు. గతేఏడాది అదే కాలంతో పోలిస్తే 43.65% వృద్ధి. ఇందులో దేశీయ పర్యాటకుల సంఖ్య 1,10,585 (45.9% పెరుగుదల), విదేశీయులు 6,961 (15.5% పెరుగుదల). లద్దాక్ ఆర్థిక వ్యవస్థలో టూరిజం ఎంత కీలక పాత్ర పోషిస్తోందో స్పష్టంగా చెప్పే సంకేతాలు. లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఈ వృద్ధిని సమర్థించడమే కాకుండా, టూరిజం రంగానికి స్థానికులకు ఉపాధి కల్పించే ముఖ్యమైన ఇంజిన్‌గా అభివర్ణించారు. ఆయన నాయకత్వంలో గత కొన్ని నెలల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయి. హోటల్స్, హోమ్‌స్టేలు, టూర్ ఆపరేటర్ల కోసం ఏకీకృత, సరళీకృత రిజిస్ట్రేషన్ విధానం, టూరిజం యూనిట్లకు “ఇండస్ట్రీ” స్టేటస్ ఇవ్వడం కాంప్లయన్స్ భారం తగ్గించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించాయిఈ సంస్కరణలు స్థానిక యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాయి. హోమ్‌స్టేలు, ట్రాన్స్‌పోర్ట్, హ్యాండిక్రాఫ్ట్, ఫుడ్ అండ్ బెవరేజెస్ రంగాల్లో ఉపాధి పెరిగింది. మెరుగైన రోడ్డు కనెక్టివిటీ, ఎక్కువ విమాన సర్వీసులు, సోషల్ మీడియా ద్వారా లద్దాక్ సౌందర్యం వైరల్ కావడం, పోస్ట్?పాండమిక్ ట్రావెల్ బూమ్ ఈ సీజన్‌ను రికార్డు స్థాయికి తీసుకెళ్లాయి. ప్రత్యేకించి మే నెలలో రోడ్లు తెరవడం, అనుకూల వాతావరణం, పర్వతాలు, సరస్సులు, మఠాలు, అడ్వెంచర్ యాత్రలు కలిపి ఒక అద్భుతమైన అనుభవాన్ని అందిస్తున్నాయి. ఈ అపూర్వ వృద్ధి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ, లద్దాక్ పర్యావరణ సున్నితత్వాన్ని మరచిపోకూడదు. ఇప్పటికే పాపులర్ స్పాట్లైన పాంగాంగ్ లేక్, నుబ్రా వ్యాలీ, లే?మనాలి హైవేల్లో క్రౌడింగ్, వాస్తే మేనేజ్‌మెంట్, నీటి కొరత, వాహనాల నుంచి వచ్చే కాలుష్యం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. లద్దాక్ ఒక ఫ్రాజైల్ ఎకోసిస్టమ్. ఇక్కడ టూరిజం వృద్ధి చెందాలంటే అది సస్టైనబుల్, రెస్పాన్సిబుల్ టూరిజంగా మాత్రమే ఉండాలి. ప్రభుత్వం, స్థానికులు, టూరిజం స్టేక్‌హోల్డర్లు కలిసి పనిచేసి, క్యాపాసిటీ బిల్డింగ్, ఆఫ్?సీజన్ టూరిజం ప్రోత్సాహం, ఎకో?టూరిజం, వేస్ట్ మేనేజ్‌మెంట్, కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించడం వంటి వ్యూహాలను అమలు చేయాలి. లద్దాక్ టూరిజం ప్రస్తుతం చూస్తున్న ఈ బూమ్ ఒక అపూర్వ అవకాశం. సరైన ప్రణాళిక, స్థానికుల పాల్గొన్నత, పర్యావరణ సంరక్షణతో కూడిన విధానాలతో ఈ వృద్ధిని మరింత స్థిరంగా, అర్థవంతంగా మార్చుకోవాలి. లద్దాక్ కేవలం ఒక టూరిస్ట్ డెస్టినేషన్ కాదు.. ఇది ఒక ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, ప్రకృతి. దానిని కాపాడుకుంటూ అభివృద్ధి చేయడమే నిజమైన విజయం.

# గ్రేటర్‌లో టీడీపీ పోటీ...

**హైదరాబాద్,** ఎన్నికల్లో టిడిపి పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీని ఉద్దేశించి టిడిపి అక్కడ యాక్టివ్ అయ్యేందుకు అన్ని సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. తెలంగాణలో తెలుగుదేశం పార్టీలో పని చేసిన నేతలంతా ఇప్పుడు చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు సమాచారం. పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తమ ప్రతిపాదనను చంద్రబాబు ఎదుట పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలోనే తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారట చంద్రబాబు. ప్రస్తుతం అక్కడ పార్టీకి నాయకత్వం లేదు కానీ.. క్యాడర్ ఇప్పటికీ కొనసాగుతోంది. టిడిపి అభిమానులు కూడా ఎక్కువే. గ్రేటర్ తో పాటు సెటిలర్స్ ఉన్న జిల్లాలు చాలా ఉన్నాయి. అటువంటి చోట్ల మాత్రం టిడిపి పేరు ప్రముఖంగా వినిపిస్తూనే ఉంటుంది. మొన్న తెలంగాణలో పర్యటనకు వచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పదివేల కోట్ల రూపాయల నిర్మాణాలకు సంబంధించి హైదరాబాదులో శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. చంద్రబాబుతో అయితే గంటల తరబడి చర్చించారు. అయితే దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఏపీలో ఎన్డీఏ కూటమి నడుస్తోంది మూడు పార్టీలతో. తెలంగాణలో సైతం మూడు పార్టీలు ఏకతాటి పైకి వస్తే బాగుంటుంది అనే అభిప్రాయం ఉంది. అయితే గతంలో మాదిరిగా ప్రత్యేక రాష్ట్ర భావన లేదు. ఇప్పుడు అంతా అభివృద్ధి అజెండాగా సాగుతోంది తెలంగాణ రాజకీయం. తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేసేందుకు ఇదే సరైన సమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర పెద్దల ఆదేశాలతో గ్రేటర్ ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య పొత్తు ఉండబోతుందనేది ఒక అంచనాతెలుగుదేశం పార్టీకి తెలంగాణలో బలమైన కేడర్ ఉంది. ఎందుకంటే ఆ పార్టీ పుట్టింది తెలంగాణలో. ఎన్టీఆర్ బలమైన పునాదులు ఏర్పాటు చేశారు. అవి తెలంగాణలో ఎక్కువగా నాటుకున్నాయి కూడా. మధ్యలో ప్రత్యేక రాష్ట్రం వాదంతో తెలుగుదేశం కాస్త ఇబ్బంది పడింది. ప్రతి దానికి చంద్రబాబు బూచి ని చూపించి రాజకీయం చేశారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరకాలం దాటుతున్న క్రమంలో క్రమేపి ప్రాంతీయ వాదం బలహీనపడుతోంది. అభివృద్ధి మంత్రం పతాక స్థాయికి చేరుకుంటుంది. అందుకే ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కలిసి నడుస్తాయన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో ప్రస్తుతం అన్ని పార్టీల్లో ఉన్న నాయకులు ఎక్కువగా టిడిపి నుంచి వెళ్లిన వారి. గులాబీ పార్టీలో అయితే ఆ పార్టీ బాస్ కెసిఆర్ నుంచి దిగువ స్థాయి కేడర్ వరకు అంతా టిడిపి దే. కాంగ్రెస్ పార్టీలో కూడా మెజారిటీ నాయకత్వం టిడిపి నుంచి వెళ్ళింది. అయితే ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో.. ఆ పార్టీలో ఉన్న పూర్వపు టిడిపి నేతలు అంతా పూర్వాశ్రమం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారట. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధమవుతున్నారట. ఇప్పటికే చంద్రబాబుకు చాలామంది టచ్లోకి వచ్చారట. సరైన సమయం చూసి చెబుతానని బాబు చెప్పారట. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో

# ప్రతి 12 కొత్త వాహనాల్లో ఒకటి ఎలక్ట్రిక్

**హైదరాబాద్** తెలంగాణలో 2025-26 ఫైనాన్షియల్ ఇయర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది రిజిస్టర్ అయిన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాల్లో 91,637 ఎలక్ట్రిక్ వాహనాలే (8.6 శాతం). అంటే ప్రతి 12 వాహనాల్లో ఒకటి ఈవీ కావడం విశేషం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సగానికి పైగా వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 769.81 కోట్ల జీవితకాల పన్ను మినహాయింపులను అందించడం ఈ వృద్ధికి కీలక దోహదకారిగా నిలిచిందని నిపుణులు చెబుతున్నారు. తెలంగాణలో పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థ దిశగా అడుగులు శరవేగంగా పడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2025-26) లో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ కాలంలో మొత్తం 91,637 ఎలక్ట్రిక్ వాహనాలు రవాణా శాఖ వద్ద నమోదయ్యాయి. ఈ ఏడాది రాష్ట్రంలో నమోదైన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాలలో ఇవి ఏకంగా 8.6 శాతం వాటాను దక్కించుకోవడం విశేషం. ఈ గణాంకాలను పరిశీలిస్తే.. తెలంగాణలో రిజిస్టర్ అయిన ప్రతి 12 కొత్త వాహనాలలో ఒకటి ఖచ్చితంగా ఎలక్ట్రిక్ వాహనమేనని స్పష్టమవుతోంది. రాష్ట్రంలో వాహనాల కొనుగోలు సామర్థ్యం, సొంత వాహనాల వాడకం విపరీతంగా పెరుగుతున్న తరుణంలోనే ఈ ఈవీ విప్లవం కూడా ఊపందుకుంది. 2025-26 లో తెలంగాణ రోడ్లపైకి రికార్డు స్థాయిలో 10.62 లక్షల నూతన వాహనాలు వచ్చాయి. అంటే సగటున ప్రతిరోజూ దాదాపు 2900 కొత్త వాహనాలు రాష్ట్ర రవాణా నెట్‌వర్క్‌లో భాగమవుతున్నాయి. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ, ప్రజల తలసరి ఆదాయం, వ్యయ సామర్థ్యం పెరగడం, విస్తరిస్తున్న పారిశ్రామిక కార్యకలాపాలు, ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పరిసరాల్లో వ్యక్తిగత ప్రయాణ సాధనాలకు పెరిగిన డిమాండ్ ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. గ్రేటర్ హైదరాబాద్, దాని పరిసర ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాలే ఎప్పటిలాగే వాహన రిజిస్ట్రేషన్లలో సింహభాగాన్ని ఆక్రమించాయి. హైదరాబాద్ జిల్లాలో 1,97,539 కొత్త వాహనాలతో మొదటి స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లాలో 1,87,044 రిజిస్ట్రేషన్లతో తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1,75,630 నూతన వాహనాలతో మూడో స్థానంలో నిలించింది. ఈ మూడు జిల్లాల పరిధిలోనే రాష్ట్రంలోని మొత్తం కొత్త వాహన రిజిస్ట్రేషన్లలో సగానికి పైగా అంటే 50 శాతానికి పైనే నమోదు కావడం గమనార్హం. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించడానికి, కొనుగోలుదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీలు, పన్ను మినహాయింపులను సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈవీ కొనుగోలుదారులకు ఏకంగా రూ. 769.81 కోట్ల విలువైన లైఫ్‌టైమ్ టాక్స్ మినహాయింపులను ప్రభుత్వం పొడిగించింది. ఈ భారీ ప్రోత్సాహకాలు ఈవీల ప్రారంభ కొనుగోలు వ్యయాన్ని తగ్గించి, పెట్రోల్-డీజిల్ వాహనాల నుండి బ్యాటరీ వాహనాల వైపు వేగంగా మారడానికి పౌరులను ప్రేరేపిస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

# సిద్ధిపేట రైల్వే స్టేషన్ పనులు పూర్తి

**మెదక్** తెలంగాణలో మరో రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేసుకుని.. ప్రారంభోత్సవానికి రెడీ అయింది. ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి రైలు స్టేషన్ పనులు దాదాపు పూర్తి అయినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. రాజీవ్ రహదారికి పక్కనే, కొమురవెల్లి మల్లన్న ఆలయానికి దగ్గర్లో ఉండే ఈ రైల్వే స్టేషన్ అందుబాటులోకి వస్తే.. ఆ పుణ్యక్షేత్రానికి వెళ్లే భక్తులకు మరింత సౌకర్యంగా ఉంటుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం.. దేశవ్యాప్తంగా కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణం, కొత్త రైలు మార్గాలు, పాత రైల్వే స్టేషన్ల పునర్నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తోంది. దీంతో తెలంగాణలో ఇప్పటికే పలు కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణాలు పూర్తై అందుబాటులోకి రాగా.. మరికొన్నింటి నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి. ఇక కొన్ని రైల్వే స్టేషన్‌లకు ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా తెలంగాణలో ప్రముఖ దేవస్థానమైన కొమురవెల్లి మల్లన్న ఆలయానికి అతి దగ్గర్లో కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణం జరుగుతోంది. అయితే కొమురవెల్లి పుణ్యక్షేత్రం రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి కావచ్చాయని.. త్వరలోనే భక్తుల ప్రయాణ కష్టాలు తీరనున్నాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. కొమురవెల్లి మల్లన్న స్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు మరింత మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు.. లకుడారం - దుద్దెడ మధ్య రైల్వే శాఖ కొమురవెల్లి హాల్ట్ రైల్వే స్టేషన్‌ను నిర్మిస్తోంది. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు 99 శాతం పూర్తి అయ్యాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి శనివారం ఒక ట్వీట్ చేశారు. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణానికి 2024 ఫిబ్రవరిలో శంకుస్థాపన చేయగా.. రూ. 5.63 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టును అత్యంత వేగంగా నిర్మించారు. ఇక రైల్వే ప్రయాణికుల కోసం ఈ కొమురవెల్లి స్టేషన్‌లో పలు అత్యాధునిక వసతులను కల్పించారు. 450 మీటర్ల పొడవైన హై లెవల్ ప్లాట్‌ఫారమ్.. 5 షెల్టర్లు, విశాలమైన వెయిటింగ్ హాల్, టికెట్ కౌంటర్లు, తాగునీటి వసతి.. మహిళలు, పురుషులు, దివ్యాంగులకు స్పెషల్ మరుగుదొడ్లను నిర్మించారు. ఈ రైల్వే స్టేషన్‌కు మెరుగైన అప్రోచ్ రోడ్లు, విశాలమైన పార్కింగ్ సౌకర్యం ఏర్పాటు చేశారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా కొమురవెల్లి రైల్వే స్టేషన్ ఆర్కిటెక్చరల్ ఎలివేషన్, మల్లన్న స్వామి, స్థానిక ప్రకృతి అందాలను ప్రతిబింబించే చిత్రాలను రూపొందించారు. ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ నిర్మాణంతో భక్తులు మల్లన్న దేవాలయానికి సులభంగా, నేరుగా చేరుకునే అవకాశం కలగనుంది. రాజీవ్ రహదారికి (ఎస్‌హెచ్-1) సమీపంలో ఈ రైల్వే స్టేషన్ ఉండటం వల్ల ప్రయాణం మరింత సజావుగా సాగుతుందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతతో రూపుదిద్దుకున్న ఈ కొమురవెల్లి రైల్వే స్టేషన్ ద్వారా తెలంగాణలో ప్రాంతీయ కనెక్టివిటీ మెరుగుపడటమే కాకుండా.. ఆధ్యాత్మిక పర్యాటకానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు భారీ ఊతం లభిస్తుందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఆర్మూర్‌లో గుప్తా వర్సెస్ గుప్తా

**నిజామాబాద్** నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మధ్య రాజకీయ వైరం పీక్స్‌కు చేరిందట. ఇద్దరి మధ్య విమర్శలు ప్రతివిమర్శలు, సవాళ్లు-ప్రతిసవాళ్లతో స్థానిక రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బీజేపీ శాసనసభ్యుడు ధన్‌పాల్‌కు మాస్ లీడర్‌గా ప్రజల్లో గుర్తింపు ఉంది. వివాదాలకు దూరంగా, నిత్యం ప్రజలకు దగ్గరగా ఉంటారని కూడా చెప్పుకుంటారు. ఇటు మాజీ ఎమ్మెల్యే బిగాలను మిస్టర్ డెవలప్‌మెంట్ అని పిలుస్తుంటారు స్థానికంగా. పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన బిగాల గణేష్ గుప్తా? అర్బన్ అభివృద్ధికి బాగానే పని చేసినట్టు చెప్పుకుంటారు. అలా? ఇద్దరిలో ఎవరి క్రేజ్ వారికి ఉన్నా?. ఇద్దరిదీ ఒకే సామాజికవర్గం అయినా?. చెరో పార్టీలో ఉండటం వల్ల ఏళ్ళుగా రాజకీయ వైరం కొనసాగుతోంది. గతంలో బిగాల ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు.. ప్రతిపక్ష నేతగా ఉన్న ధన్‌పాల్ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసేవారు.

అభివృద్ధి పనుల్లో జాప్యంపై సమయం దొరికినప్పుడల్లా మాటల తూటాలు పేల్చేవారు. అలా.. ఇద్దరు ఉప్పు-నిప్పులా మారారు. కానీ? తర్వాత ఓడలు బండ్లు- బండ్లు ఓడలు అయ్యాయినిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరపున ధన్‌పాల్ ఎమ్మెల్యే అవగా? బిగాల మాజీగా మిగిలిపోయారు. తన హయాంలో మొదలుపెట్టిన అభివృద్ధి పనులను ప్రస్తుత ఎమ్మెల్యే ధన్‌పాల్ కావాలనే నిర్వీర్యం చేస్తున్నారంటూ అవకాశం దొరికినప్పుడల్లా.. విమర్శిస్తున్నారు మాజీ ఎమ్మెల్యే. అందుకు సిట్టింగ్ కూడా ఎప్పటికప్పుడు కౌంటర్ ఇస్తున్నారు. ఐతే ఇప్పుడు ఆ విమర్శల పరంపర పీక్స్‌కు చేరుకుంది. మున్సిపాలిటీలో ఎండిన మొక్కల సాక్షిగా పొలిటికల్ ప్రకంపనలు రేగుతున్నాయి. అసలే దశాబ్దకాలంగా సాగుతున్న వైరానికి ఇప్పుడీ ఎండు మొక్కల కారణంగా మంట గట్టిగానే అంటుకుంది. నిజామాబాద్‌లో డివైడర్స్ మధ్య తన హయాంలో నాటిన మొక్కలు ఇటీవల ఎండిపోవడం చూసి చలించిపోయారట మాజీ ఎమ్మెల్యే బిగాల. ఆ ఎండిన చెట్లకే బిందెలతో స్వయంగా నీళ్లు పోసి నిరసన తెలిపారాయన. ఇటు మినీ ట్యాంక్‌బండ్‌కు నెల రోజులుగా తాళం వేసి ఉండటాన్ని చూసి స్వయంగా పరిశీలించారాయన. తర్వాత బీజేపీ ఎమ్మెల్యే పై సోషల్ మీడియాలో విరుచుకుపడ్డారు ఎక్స్ ఎమ్మెల్యే. ఉద్దేశ్యపూర్వకంగానే తన హయంలో చేసిన అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తున్నారంటూ విమర్శించారు బిగాల. ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా రాజీనామా కోసం డిమాండ్ చేశారు. అందుకు ధన్‌పాల్ కూడా ఘాటుగా రియాక్ట్ అయ్యారు.

## నిరుద్యోగులతో చెలగాటమాడుతున్న

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**హైదరాబాద్** సిపిఎం ఆధ్వర్యంలో రెండు రోజుల యువజన సమ్మేళనం జరగనుంది. ఈ నెల 16, 17 తేదీల్లో కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రామ్ హాలులో యువజన సమ్మేళనం జరగనుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. కక్రోజ్ పార్టీ పేరుతో యూత్ నిరసన వ్యక్తం చేస్తుంది. ఈ సమ్మేళనంలో యువజన సమస్యలపై చర్చించడంతోపాటు భవిష్యత్తు కార్యచరణ. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువత భవిష్యత్ పై దృష్టి పెట్టటడంలేదు. ప్రభుత్వం రంగంలో 60లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయి. ఏడాదికి 2లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రయివేటు పరం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్నాయి. రైల్వేస్ లో 10లక్షల ఖాళీలు ఉన్నాయి. రాజీవ్ యువ వికాసం ప్రకటించి దానికి నిధులు కేటాయించటం లేదు. నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఎస్సీ ఎస్టీసంక్షేమం నిర్వీర్యం అయ్యాయని ఆయన ఆరోపించారు..

# 'రామాయణ'లో కీలకపాత్ర ..

## – అధికారికంగా వెల్లడించిన కాజల్

బాలీవుడ్ దర్శకుడు నితేష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూపొందిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రామాయణం'లో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తలపై నటి కాజల్ అగర్వాల్ స్పష్టతనిచ్చారు. ఈ భారీ ప్రాజెక్టులో తాను భాగమైనట్లు ఆమె ధృవీకరించారు. ఇటీవల జరిగిన ఒక అవార్డుల కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ఈ చిత్రం కోసం తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా కాజల్ మాట్లాడుతూ, "భారతదేశంలో ఇంతకుముందెన్నడూ చూడని అద్భుతమైన సాంకేతిక హంగులతో ఈ సినిమా రూపుదిద్దుకుంటోంది. ఇది నా కెరీర్‌లో ఒక మైలురాయిలా నిలిచిపోతుంది" అని వ్యాఖ్యానించారు. ఈ చిత్రంలో రావణుడి భార్య మండోదరి పాత్రలో కాజల్ కనిపించనున్నారు. 'రామాయణం'లో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడి పాత్రలో కన్నడ స్టార్ యశ్ నటిస్తున్నారు. వీరితో పాటు హనుమంతుడి పాత్రను సన్నీ డియోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనుండగా, తొలి భాగాన్ని 2026 దీపావళి కానుకగా, రెండో భాగాన్ని 2027లో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్రబృందం లక్ష్యంగా పెట్టుకుంది.



# ఇండస్ట్రీలో అది గోల్డెన్ రూల్

సాంఘిక మాధ్యమం అనేది పరిశ్రమలో చాలామందికి వ్యసనంగా, ఇంకా చెప్పాలంటే శాపంగా మారిందని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో రష్మిక మందన్నా అన్నారు. సోషల్ మీడియాలో నెగెటివిటీ గురించి మాట్లాడుతూ ఆమె పై రీతిగా స్పందించారు. 'పాజిటివ్ కామెంట్స్ వందల్లో ఉన్నప్పటికీ, ఎక్కడో ఒక మూల ఉన్న నెగెటివ్ కామెంట్ మనశ్శాంతిని పూర్తిగా దెబ్బతీస్తుంది. రోజంతా పడ్డ కష్టాన్ని, తద్వారా వచ్చిన ఆనందాన్ని క్షణాల్లో మాయం చేస్తుంది. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే నేనూ.. నా సినిమాలు విడుదలైన సమయంలో విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటూ ఉంటాను. రిలీజ్ రోజులో పగటిపూట వాతావరణం చాలా బావుంటుంది. కామెంట్లన్నీ సానుకూలంగా కనిపిస్తాయి. రాత్రి 9గంటలు దాటాక నెగెటివిటీ, ట్రోలింగ్ ఒక్కసారిగా పెరుగుతుంది. రోజంతా ప్రశాంతంగా ఉన్న నెటిజన్లు, రాత్రి కాగానే ఎందుకు అంతలా మారిపోతారో అర్థంకాదు. దీనివల్ల రాత్రి 9గంటలు దాటాక ఎట్టి పరిస్థితుల్లోనూ సోషల్ మీడియా ఓపెన్ చేయకూడదనేది ఇండస్ట్రీలో గోల్డెన్ రూల్‌గా మారింది' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు రష్మిక మందన్నా.



# జాన్వీ కపూర్ తప్పు లేదు..

## 'పెద్ది' వివాదంపై నటి మేకప్ ఆర్టిస్ట్ పోస్ట్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన 'పెద్ది' సినిమా బాక్సాఫీస్ వద్ద రూ. 236 కోట్లకు పైగా వసూళ్లతో దూసుకుపోతున్నప్పటికీ.. హీరోయిన్ జాన్వీ కపూర్ (అచ్చియమ్మ పాత్ర)ను చూపించిన విధానంపై వివాదం మాత్రం సలసలా మరుగుతూనే ఉంది. సినిమాలో జాన్వీ శరీరాన్ని, నడుము భాగాన్ని జూమ్ చేస్తూ కెమెరా యాంగిల్స్ పెట్టడంపై ప్రేక్షకులు దర్శకుడిపై మండిపడుతున్నారు. అయితే, ఈ వివాదంలో జాన్వీని నిందించాల్సింది ఏమీ లేదని, ఆమెకు ఈ సీన్లు ఇష్టం లేకపోయినా బలవంతంగా ఉంచారని చెబుతూ ఆమె పర్సనల్ మేకప్ ఆర్టిస్ట్ సవ్లీన్ కౌర్ మన్‌చందా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. జాన్వీతో చాలా కాలంగా పనిచేస్తున్న సవ్లీన్ కౌర్.. తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఈ విషయమై స్పందించారు. "హీరోయిన్లు చేసే పాత్రలను బట్టి వారిని తప్పుబట్టడం చాలా సులువు. కానీ తెరవెనుక అసలు ఏం జరిగిందనే టైమ్‌లైన్ వేరేలా ఉంటుంది" అని ఆమె పేర్కొన్నారు. షూటింగ్ సమయంలోనే కాకుండా, పోస్ట్ ప్రొడక్షన్ (డబ్బింగ్, ఎడిటింగ్) సమయంలోనూ తన శరీరాన్ని జూమ్ చేసి చూపే కెమెరా యాంగిల్స్ పట్ల జాన్వీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిందని, ఒక ప్రొఫెషనల్‌గా నటీనటులకు ఉండాల్సిన హద్దుల గురించి గట్టిగానే మాట్లాడిందని సవ్లీన్ స్పష్టం చేశారు. ఇండస్ట్రీ వర్గాల సమాచారం ప్రకారం.. షూటింగ్ సమయంలో నడుము, నాభి భాగాలపై జూమ్ షాట్లు తీస్తున్నప్పుడు జాన్వీ కపూర్ అసౌకర్యానికి గురైందని, ఆ సమయంలో కో-స్టార్ రామ్ చరణ్ కూడా ఆమెకు మద్దతుగా నిలిచి దర్శకుడితో మాట్లాడారని తెలుస్తోంది. అయినప్పటికీ, జాన్వీ మాటలను పక్కనపెట్టి ఫైనల్ ఎడిటింగ్‌లో ఆ సీన్లను అలాగే ఉంచేశారని, సినిమా విడుదలయ్యాక వివాదం రేగడంతో ఇప్పుడు ఆ తప్పు నటిపైకి నెట్టేలా ప్రచారం సాగుతోందని సవ్లీన్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి సంబంధించిన కొన్ని లీకైన వాట్సాప్ చాట్స్ కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. సినిమా జూన్ 4న విడుదలైన తర్వాత మహిళలను ఇలా అందాల వస్తువుగా చూపించడంపై నటి నిత్య మీనన్ వంటి తారలు కూడా విమర్శలు గుప్పించారు. వివాదం ముదరడంతో దర్శకుడు బుచ్చిబాబు సానా ఇప్పటికే ప్రేక్షకులకు బహిరంగ క్షమాపణలు చెప్పి, థియేటర్ల నుండి దాదాపు 3 నిమిషాల అభ్యంతరకర సీన్లను తొలగించారు. కాగా, ఈ వివాదంపై జాన్వీ కపూర్ ఇప్పటివరకు నేరుగా ఎలాంటి ప్రకటన చేయలేదు.

# 'పెద్ది' వివాదంపై

## నిత్య మీనన్ సంచలన వ్యాఖ్యలు!


మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్‌లో జూన్ 4న విడుదలైన 'పెద్ది' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో దూసుకుపోతోంది. అయితే, ఈ సినిమాలో హీరోయిన్ జాన్వీ కపూర్ (అచ్చియమ్మ పాత్ర)ను చూపించిన విధానంపై సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. హీరోయిన్ ఇంట్రడక్షన్ సీన్‌లో ఆమె శరీరాన్ని జూమ్ చేస్తూ చూపించడం, ఆమె ప్రమేయం లేకుండా హీరో తాకే సీన్లను రొమాంటిక్‌గా చూపించడంపై ప్రేక్షకులు మండిపడుతున్నారు. ఈ వివాదంపై తాజాగా స్టార్ నటి నిత్య మీనన్ సంచలన వ్యాఖ్యలు చేసింది. తాను ఇంకా ఈ సినిమా చూడలేదని చెబుతూనే.. జాన్వీ కపూర్‌కు ఎదురవుతున్న విమర్శలపై నిత్య మీనన్ స్పందించారు. "సినిమాల్లో మహిళలను కేవలం ఒక అందాల వస్తువుగా (ాఎయవష్‌ఱటఱఝ్ఱశీఅ) చూపించడాన్ని నేను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాను. ఇలాంటి సీన్లు చేసేటప్పుడు నటీనటులకు కొన్ని హద్దులు ఉండాలి. తమకు నచ్చని సీన్లు ఉన్నప్పుడు 'మేము ఇది చేయలేం' అని నిర్మొహమాటంగా చెప్పే ధైర్యం ఉండాలి. కెరీర్ ప్రారంభం నుంచే ఇలాంటి విషయాల్లో కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడం చాలా ముఖ్యం" అని నిత్య మీనన్ ఒక ఇంటర్వ్యూలో అభిప్రాయపడింది.ద

కేవలం సౌత్ ఇండియన్ సినిమాల్లోనే ఇలా జరుగుతుందనే ప్రచారాన్ని నిత్య మీనన్ తప్పుబట్టింది. ఇది కేవలం ఒక్క పరిశ్రమకు సంబంధించిన సమస్య కాదని, బాలీవుడ్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా కమర్షియల్ సినిమాల్లో గ్లామర్‌కే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని పేర్కొంది. గతంలో సీనియర్ నటి అను అగర్వాల్ కూడా ఇదే తరహాలో స్పందిస్తూ.. నటీనటులు తమ గౌరవాన్ని తగ్గించే పాత్రలను తిరస్కరించాలని కోరింది. జాన్వీ కపూర్ కూడా పోస్ట్ ప్రొడక్షన్ సమయంలో కొన్ని సీన్లపై అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ వివాదంపై దర్శకుడు బుచ్చిబాబు సానా స్పందిస్తూ ప్రేక్షకులకు బహిరంగ క్షమాపణలు చెప్పారు. ప్రేక్షకుల అభ్యంతరాలను గౌరవిస్తూ సినిమాలోని వివాదాస్పద సీన్లకు సంబంధించిన దాదాపు 3 నిమిషాల ఫుటేజీని థియేట్రికల్ వెర్షన్ నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. ఒకవైపు ఈ క్యారెక్టరైజేషన్‌పై ఇండస్ట్రీలో పెద్ద ఎత్తున చర్చ నడుస్తున్నప్పటికీ, 'పెద్ది' సినిమా మాత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టిస్తూ కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది.



# విభిన్నంగా నాగబంధం

ప్రసిద్ధ దేవాలయాల్లో నిక్షిప్తమై ఉండే నేలమాళిగలు, వాటితో దాగుండే నిధి నిక్షేపాలు, వాటి వెనుక రహస్యాలు, దైవ నిర్ణయాలు.. తదితర అంశాల మేళవింపుగా రూపొందుతున్న పానిండియా మైథలాజికల్ యాక్షన్ అడ్వెంచర్ 'నాగబంధం'. విరాట్‌కర్ణ కథానాయకుడిగా, అభిషేక్ నామా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రానికి కిశోర్ అన్నపురెడ్డి, నిషితా నాగిరెడ్డి నిర్మాతలు. నభా నటేష్, ఐశ్వర్యమీనన్ కథానాయికలు. జులై 3న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఈ సినిమా ప్రచారాన్ని భిన్నంగా మేకర్స్ ప్లాన్ చేశారు. ట్రెజర్ హంట్ నేపథ్యంలో రూపొందుతున్న సినిమా కావడంతో దానికి తగ్గట్టుగా ప్రచార యాత్రను రూపొందించారు. ప్రతి నగరంలో జరిగే ఈ కార్యక్రమం ద్వారా 'నాగబంధం' ప్రపంచాన్ని, అందులోని రహస్యాలను, సాహస అంశాలనూ ప్రేక్షకులకు మరింత చేరువ చేసి, సినిమాపై ఆసక్తిని పెంచనున్నారు. ఈ నెల 19న హైదరాబాద్‌లో ట్రైలర్ లాంచ్ నిర్వహించి, 20 నుంచి 23 వరకూ ముంబై, చెన్నై, బెంగళూరు, కొచ్చీ నగరాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు మేకర్స్ తెలిపారు. ఈ నెల 26న వారణాసిలో ఈ సినిమాలోని 'వీర నాగ..' పాటను విడుదల చేస్తున్నామని, అలాగే ఈ నెల 28న హైదరాబాద్‌లో గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించి, జులై 2న ప్రీమియర్‌షోతో ఈ ప్రమోషనల్ జర్నీని ఘనంగా సెలబ్రేట్ చేయనున్నామని మేకర్స్ ప్రకటనలో పేర్కొన్నారు.



# కలెక్టర్ మాకు న్యాయం చేయండి

**- పొలాలకు వెళ్లే బాటను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలి**

**- అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలి: తిగుల్ రైతుల విజ్ఞప్తి**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** వ్యవసాయ పొలాలకు వెళ్లే సంప్రదాయ బండ్లబాటను అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకుని, రైతులపై నమోదైన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ తిగుల్ గ్రామ రైతులు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం, జగదేవపూర్ తహసీల్దార్ కార్యాలయాల్లో కూడా వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 80 సంవత్సరాలుగా ఉన్న బండ్లబాటను అన్ని వర్గాలకు చెందిన రైతులు వినియోగిస్తున్నారని తెలిపారు. కురుమ, మాల, మాదిగ, చాకలి, రెడ్డి తదితర సామాజిక వర్గాలకు చెందిన సుమారు 100 రైతు కుటుంబాలు దాదాపు 600 ఎకరాల వ్యవసాయ భూములకు ఇదే మార్గం ద్వారా రాకపోకలు సాగిస్తున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా గ్రామంలో మరణించిన కుటుంబ సభ్యుల అంత్యక్రియల కోసం కూడా ఇదే దారిని ఉపయోగిస్తున్నామని తెలిపారు. ఫిబ్రవరి నెలలో గ్రామసభలో ఈ బాటను ఉపాధి హామీ పథకం ద్వారా మట్టి రహదారిగా అభివృద్ధి చేయాలని తీర్మానం చేసినట్లు రైతులు వెల్లడించారు. అయితే ప్రస్తుతం ఆ బాట తన పట్టా భూమిలో ఉందని పేర్కొంటూ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి బాటను దున్నివేసి రైతుల రాకపోకలను అడ్డుకుంటున్నాడని ఆరోపించారు. రైతులందరూ కలిసి బాటను పునర్నిర్మించుకుని ఉపయోగించుకుంటుండగా, సంబంధిత వ్యక్తి 18 మంది రైతులపై జగదేవపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేయించాడని వాపోయారు. ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్ స్పందించి పూర్తి స్థాయిలో విచారణ జరిపి, రైతులకు న్యాయం చేయడంతో పాటు అక్రమంగా నమోదైన కేసులను రద్దు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వాన్ని చాటుకున్న చెలిమి ఫౌండేషన్

**- భాధితుడికి రూ.40 వేల ఆర్థిక సహాయంచెలిమి ఫౌండేషన్ 87వ సహాయ కార్యక్రమం**



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** ఆపదలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి అండగా నిలిచి చెలిమి ఫౌండేషన్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకుంది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కోమటిబండ గ్రామానికి చెందిన, ప్రస్తుతం గజ్వేల్ పట్టణంలో నివాసముంటున్న బైక్ మెకానిక్ తూం దేవేందర్ వైద్య చికిత్స కోసం చెలిమి ఫౌండేషన్ మరియు దాని మిత్రుల బృందం కలిసి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశాయి. తూం దేవేందర్ వృత్తిరీత్యా బైక్ మెకానిక్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. గతంలో ఆయనకు గుండె శస్త్రచికిత్స జరగడంతో నిరంతరం మందులు వాడుతున్నారు. ఇటీవల ఆయన ఆరోగ్యం మళ్లీ క్షీణించడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను సికింద్రాబాద్‌లోని యశోద ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. వైద్య ఖర్చులు భారీగా పెరగడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా బలహీనంగా ఉండటంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలుసుకున్న చెలిమి ఫౌండేషన్ వెంటనే స్పందించి, ఫౌండేషన్ తరఫున రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. అదేవిధంగా ఫౌండేషన్ మిత్రులు ప్రత్యేకంగా స్పందించి మరో రూ.25 వేల విరాళాలను సేకరించారు. మొత్తం రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని చెలిమి ఫౌండేషన్ ప్రతినిధులు దేవేందర్ కుటుంబ సభ్యులను నేరుగా కలిసి అందజేసి, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమం చెలిమి ఫౌండేషన్ చేపట్టిన 87వ సహాయ కార్యక్రమంగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో చెలిమి ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, యాట ఆంజనేయులు, పెద్దూరి శ్రీనివాస్, టెంటు మెతుకు నర్సింలు, చేపూరి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## ఈదురుగాలుల భీభత్సం - బిహారి వాసి మృతి

**- బోయినిపల్లి ఎస్సై : రమాకాంత్**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో వీచిన ఈదురు గాలులకు విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని ఓ పంచర్ షాపు రేకుల షెడ్ పూర్తిగా ఎగిరి రోడ్డుకు అవతలి వైపు పడిపోయింది. ఆ సమయంలో షాపులో ఉన్న బీహార్ రాష్ట్రానికి చెందిన ఎండి షంషద్ (30) రేకుల షెడ్డుతో పాటు రోడ్డుపై పడి డివైడర్‌పై బలంగా పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన షంషద్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ సోమవారం ఉదయం 9:22 గంటలకు మృతి చెందినాడు. మృతుడి బావమరిది సద్దాం మహమ్మద్ అన్సారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బోయినిపల్లి ఎస్సై రమాకాంత్ తెలిపారు.

## విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక హెల్ప్‌లైన్ నంబర్లు

**- విద్యుత్ శాఖ అధికారులు**




**భీంగల్ (ప్రశ్న న్యూస్)** నిజామాబాద్ జిల్లా, భీంగల్ పట్టణ ప్రజలకు విద్యుత్ సేవలను మరింత వేగవంతంగా అందించేందుకు విద్యుత్ శాఖ ప్రత్యేక సంప్రదింపు నంబర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. పట్టణంలో విద్యుత్ సరఫరా అంతరాయం, లైన్ లోపాలు, ఫ్యూజ్ ఆఫ్ కాల్ సమస్యలు లేదా ఇతర విద్యుత్ సంబంధిత ఇబ్బందులు ఎదురైనప్పుడు ప్రజలు నేరుగా విధుల్లో ఉన్న లైన్‌మన్‌లను సంప్రదించాలని విద్యుత్ శాఖ అధికారులు సూచించారు. విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం లైన్‌మన్--1: 8712485370, లైన్‌మన్--2: 8712488468 నంబర్లను కేటాయించినట్లు తెలిపారు. ఈ నంబర్లకు కాల్ చేసి సమస్యను తెలియజేస్తే సిబ్బంది తక్షణమే స్పందించి పరిష్కార చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ప్రజలకు నిరంతరాయ విద్యుత్ సేవలు అందించడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక సంప్రదింపు వ్యవస్థను అమలు చేస్తున్నట్లు భీంగల్ విద్యుత్ శాఖ సిబ్బంది వెల్లడించారు. విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు ఆలస్యం చేయకుండా సంబంధిత నంబర్లకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

# ఫీజులతో ఎన్కౌంటర్ తల్లిదండ్రుల విలవిల

**- ప్రైవేట్ స్కూళ్ల దోపిడీకి అడ్డుకట్ట ఎక్కడ.? - బుక్స్, డ్రెస్సులు, యాప్‌ల పేరుతో తల్లిదండ్రుల జేబులకు చిల్లులు**

**- ఎంఈఓ, డిప్యూటీఈవో, డిఈవోల పర్యవేక్షణ శూన్యం - స్కూల్లలోనీ బుక్కులు, డ్రెస్సులు, యాప్ లు అమ్ముకుంటున్న దుర్మార్గం**

**(గౌటీ రామకృష్ణ --ప్రశ్న న్యూస్)**



తెలంగాణలో ప్రైవేటు పాఠశాలల దోపిడి తీవ్ర స్థాయికి చేరిపోయింది. ప్రభుత్వం కట్టడి చేయడంలో చేతులెత్తయడంతో పాటు విద్యాశాఖ అధికారులు లంచాలకు మరిగి ప్రైవేటు స్కూల్ యజమానులతో చేతులు కలిపి ప్రజలను నిలువు దోపిడీకి గురి చేస్తున్నారు. ప్రైవేట్ పాఠశాలల ఫీజుల భారం మిడిల్ క్లాస్ కుటుంబాలను తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేస్తోంది. ఒకవైపు వార్షిక ఫీజులు, మరోవైపు పుస్తకాలు, యూనిఫాంలు, రవాణా, ప్రత్యేక కార్యక్రమాల పేరుతో పాటు స్కూల్లు ఏర్పాటు చేసుకున్న యాప్ కొనుగోళ్ల పేరుతో వసూళ్లు చేస్తూ తల్లిదండ్రులను అప్పుల ఊబిలోకి నెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విద్యను వ్యాపారంగా మార్చి లక్షల రూపాయల ఆదాయం పొందుతున్న కొన్ని ప్రైవేట్ విద్యాసంస్థలపై కాంగ్రెస్ ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారంటూ తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

### స్కూల్ యాప్ పేరుతో కొత్త దోపిడీ..

ఇటీవల అనేక ప్రైవేట్ పాఠశాలలు "స్కూల్ యాప్" పేరుతో అదనపు భారాన్ని మోపుతున్నాయి. హోంవర్క్, హాజరు, పరీక్ష ఫలితాలు, ఫీజుల చెల్లింపుల కోసం యాప్ తప్పనిసరి అంటూ ప్రత్యేక రుసుములు (దాదాపు 5వేల నుండి 10వేల వరకు) వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థుల అభ్యాసానికి ఉపయోగపడాల్సిన సాంకేతికతను కూడా ఆదాయ వనరుగా మార్చడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### స్కూల్ యజమానులే బుక్స్, డ్రెస్సుల విక్రేతలు

ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కనపెట్టి ప్రైవేటు పాఠశాలలు పుస్తకాలు, యూనిఫాంలను తమ వద్దే కొనుగోలు చేయాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తెస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే వస్తువులను అధిక ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. "ఎక్కడ కొనాలి, ఏ బ్రాండ్ కొనాలి" అనే స్వేచ్ఛ కూడా తల్లిదండ్రులకు లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు.

### విద్యాశాఖ పర్యవేక్షణ శూన్యం.?

ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ, ఉపాధ్యాయుల అర్హతలు, మౌలిక వసతుల తనిఖీల విషయంలో విద్యాశాఖ వ్యవస్థ పూర్తిగా విఫలమైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బీఈడీ వంటి కనీస అర్హతలు లేని ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠశాలల్లో కూడా లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డీఈవో అధికారుల నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

### ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్లతో కుమ్మక్కు ఆరోపణలు

విద్యాశాఖ అధికారుల అవినీతిపై కొంతమంది తల్లిదండ్రులు మరింత తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నారు. ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్లు, విద్యాశాఖలోని కొందరు అధికారుల మధ్య కుమ్మక్కు ఉందని, అందుకే నిబంధనలు ఉల్లంఘించినా పాఠశాలలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. లంచాల కారణంగానే తనిఖీలు చేస్తున్నట్లు నటనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయా.? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారిక ఆధారాలు బయటకు రావాల్సి ఉంది.

### తెలంగాణలో విద్య వ్యాపారమా.? సేవా.?

విద్య అనేది సమాజ అభివృద్ధికి మూలస్తంభం. కానీ నేడు ప్రైవేట్ విద్యాసంస్థల వ్యవహారశైలి చూస్తే అది సేవా రంగం కాదు కేవలం లాభాల కోసం ఏర్పాటుచేసిన వ్యాపారమే అన్న సందేహం కలుగుతోంది. ప్రతి విద్యా సంవత్సర ప్రారంభంలో ఫీజుల పేరిట తల్లిదండ్రులపై పడుతున్న అధిక భారాన్ని నియంత్రించడంలో ప్రభుత్వం, విద్యాశాఖ పూర్తిగా విఫలమైతే సామాన్య కుటుంబాలకు నాణ్యమైన విద్య అందని ద్రాక్షగా మారే ప్రమాదం ఉంది. ప్రజా సంక్షేమంపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ప్రైవేట్ స్కూళ్ల ఫీజులపై కఠిన నియంత్రణ చట్టం తీసుకురావాలి. బుక్స్, యూనిఫాంల విక్రయాలపై ప్రత్యేక విచారణ జరపాలి. స్కూల్ యాప్‌ల పేరుతో వసూలు చేస్తున్న అదనపు రుసుములను పూర్తిగా రద్దు చేయాలి. అర్హతలేని ఉపాధ్యాయులను నియమిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి. ఫీజుల దోపిడీ, నిబంధనల ఉల్లంఘనలపై జిల్లా స్థాయిలో ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలి. "ఫీజుల భారం మోయలేక మధ్యతరగతి కుటుంబాలు విలవిలలాడుతుంటే, విద్యాశాఖ మాత్రం మౌనంగా ఉండడం ఎందుకు.? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన అవసరం కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉంది.

# అనుమతులు లేకున్నా కాలనీలో వెలుస్తున్న కార్పొరేట్ కళాశాలలు





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హబ్సిగూడ లోని స్ట్రీట్ నెంబర్ 3 లో కాలనీ మధ్యలో అనుమతులు లేకున్నా నడిపిస్తున్న కార్పొరేట్ కళాశాలను కాలనీ వాసులు కాలేజీ ముందు నిరసన వ్యక్తపరిచారు. తమ కాలనీ లో కళాశాలను ఏర్పాటు చేయటం తో ట్రాఫిక్ సమస్యలతో పాటు రోజు పిల్లల గొడవలు గోలలతో తమ ప్రశాంతతకు భంగం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్పొరేట్ కళాశాలకు ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఆంతే కాకుండా ఇక్కడ కళాశాల ఏర్పాటును కాలనీ వాసులు కోర్టు నుండి స్టే ఆర్డర్ తెచ్చుకున్న కళాశాల యాజమాన్యం, ప్రభుత్వ ఉద్యోగులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారని ధ్వజమెత్తారు. ప్రశాంతంగా ఉండే కాకతీయ నగరులో వాహనాల రాకపోకలు పెరిగి వాహన ధ్వనులతో ఉదయం మధ్యాన్నం మారుమోగుతోంది తెలిపారు. ఇదంతా చూస్తూ కాలనీ పాలక వర్గం తమకేమి సంబంధం లేనట్లు వ్యవహరించటం తో అనుమానాలను రేకెత్తిచే విధంగా ఉందని తెలియజేసారు. కాలనీ పాలక వర్గ విభేదాలను కూడా ఈ కళాశాల యాజమాన్యం తమకు అనువుగా ఉన్నవారితో కలసి తమ పనులను చక్కబెట్టుకుంటున్నారనే అనుమానాలను వ్యక్త పరుస్తున్నారు. ఇకనైనా ప్రభుత్వ పెద్దలు ఈ విషయం లో జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలనీ కాలనీ వాసుల డిమాండ్ చేస్తున్నారు. ఈ నిరసనలో బొమ్మగౌని రఘుపతి గౌడ్, మనీష్ రెడ్డి నరోత్తం రెడ్డి బాబురావు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## తడగొండలో అక్రమ చెట్ల నరికివేతపై రెవెన్యూ అధికారుల దాడి - ట్రాక్టర్ స్వాధీనం

**- బాధ్యులపై కఠిన చర్యలు తప్పవు - మండల రెవెన్యూ అధికారులు**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, తడగొండ గ్రామ శివారులోని నల్లగుంట చెరువు పరిసర ప్రాంతంలో అక్రమంగా చెట్లను నరుకుతున్నారనే సమాచారంతో రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అందిన విశ్వసనీయ సమాచారాన్ని ఆధారంగా చేసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్ మనోజ్ కుమార్, జి.పి.ఓ కవిత అక్కడ పరిస్థితులను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా చెట్ల నరికివేత కార్యకలాపాలకు వినియోగిస్తున్న ట్రాక్టర్‌ను అధికారులు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. చెరువు కట్టపై ఉన్న విలువైన చెట్లను ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా కొందరు వ్యక్తులు నరికి తరలిస్తున్నట్లు గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## అనంతపల్లి అంబేద్కర్ యూత్‌కు క్రికెట్ కిట్ అందజేత

**- యువతలో క్రీడాస్ఫూర్తి దిశగా గంగామహి చేయూత**



**బోయినిపల్లి (ప్రశ్న న్యూస్)** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలం, అనంతపల్లి గ్రామంలో యువతలో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించే లక్ష్యంతో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి, అనంతపల్లి గ్రామానికి చెందిన బైరి గంగామహి అంబేద్కర్ యూత్ సభ్యులకు దాదాపు రూ.10 వేల విలువైన క్రికెట్ కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ యూత్ సభ్యులు మాట్లాడుతూ గ్రామ యువకుల క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు, క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు గంగామహి అందించిన సహాయం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ప్రేమ్, బూరుగు ప్రవీణ్ కుమార్, పర్స వేణు, దొమ్మటి నరేష్, గంగాధర్ నరేష్, మల్లారపు గణేష్, తుంగపల్లి శ్రవణ్‌తో పాటు అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

# తిరుమలలో పుట్టగొడుగుల్లా టిఫిన్ సెంటర్లు

## – ఫుడ్ సేఫ్టీకి ఎవరు బాధ్యులు.?




- వరాహస్వామి గెస్ట్ హౌస్ రోడ్డు వెంట విచ్చలవిడిగా హోటళ్లు
- నాణ్యతపై అనుమానాలు.. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ.?
- టీటీడీలో ఆహార భద్రత పర్యవేక్షణ ఉందా లేదా.?
- ఫుడ్ సేఫ్టీకి ఫుల్‌స్టాప్.? ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ.?
- తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం ఉన్నా ప్రైవేట్ హోటళ్లపై ఆధారపడాల్సిన పరిస్థితి
- భక్తుల రద్దీని టీటీడీ తట్టుకోలేకపోతోందా.?







**తిరుమల/ తిరుపతి (ప్రశ్న న్యూస్)** కలియుగ వైకుంఠం తిరుమలలో భక్తుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ మరో ఆందోళనకర పరిణామం చోటుచేసుకుంటోంది. శ్రీవారి దర్శనం కోసం దేశ రాష్ట్రాల, విదేశాల నుంచి వచ్చే భక్తులతో కిటకిటలాడే తిరుమలలో ఇప్పుడు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ముఖ్యంగా వరాహస్వామి గెస్ట్ హౌస్ రోడ్డు వెంట ఎటు చూసినా టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు, చిరుతిండి దుకాణాలే కనిపిస్తున్నాయి. భక్తుల అవసరాల పేరుతో సాగుతున్న ఈ వ్యాపారాల వెనుక ఆహార నాణ్యత, పరిశుభ్రత, అధికారుల పర్యవేక్షణ వంటి అంశాలు ప్రశ్నార్థకంగా మారాయి. తిరుమల అనేది సాధారణ పర్యాటక ప్రాంతం కాదు. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక. అలాంటి పవిత్ర క్షేత్రంలో విక్రయించే ఆహార పదార్థాలు అత్యున్నత ప్రమాణాలతో ఉండాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం కనిపిస్తున్న పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొన్ని టిఫిన్ సెంటర్ల వద్ద పరిశుభ్రత లోపాలు, ఆహార పదార్థాల నిల్వలో నిర్లక్ష్యం, నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### నాణ్యతపై నిఘా ఉందా.?

భక్తులు తింటున్న ఇడ్లీలు, దోశలు, పూరీలు, ఇతర ఆహార పదార్థాల తయారీలో ఉపయోగిస్తున్న నూనెలు, ముడి సరుకులు, తాగునీరు నాణ్యమైనవేనా.? కాలం చెల్లిన వస్తువులు వినియోగించడం లేదా.? వంటశాలలు ఆరోగ్య శాఖ నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా.? అనే ప్రశ్నలకు సమాధానాలు కనిపించడం లేదు. రోజూ వేలాది మంది భక్తులు ఈ హోటళ్లపై ఆధారపడుతున్నప్పటికీ, వాటిపై టీటీడీ పర్యవేక్షణ ఎంత మేరకు జరుగుతోందన్నది స్పష్టత లేని అంశంగా మారిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ.?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. తిరుమలలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారా.? ఉంటే వారు ఏమి చేస్తున్నారు.? ఇప్పటివరకు ఎన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.? ఎన్ని ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించారు.? నిబంధనలు ఉల్లంఘించిన సంస్థలపై ఎన్ని కేసులు నమోదు చేశారు.? ఎన్ని లైసెన్సులను రద్దు చేశారు.? అనే వివరాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉంది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే ఆధ్యాత్మిక క్షేత్రాల్లో ఒకటైన తిరుమలలో ఆహార భద్రతపై కఠిన నిఘా ఉండాల్సి ఉండగా, క్షేత్రస్థాయిలో అలాంటి తనిఖీలు అసలు కనిపించడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. దీంతో ఫుడ్ సేఫ్టీ వ్యవస్థ కేవలం రికార్డులకే పరిమితమైందా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. టీటీడీ పాలకమండలి కూడా దీనిపై దృష్టి సారించకపోవడం చూస్తుంటే భక్తుల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

### తరిగొండ వెంగమాంబ ఉంటే ఈ హోటళ్ల అవసరం ఎందుకు.?

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనం దేశంలోనే అత్యుత్తమ ఉచిత భోజన కేంద్రాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రతిరోజూ వేలాది మంది భక్తులకు నాణ్యమైన, పరిశుభ్రమైన భోజనం అందిస్తోంది. భక్తుల నుంచి కూడా మంచి స్పందన పొందుతోంది. అలాంటి వ్యవస్థ అందుబాటులో ఉండగా, ప్రైవేట్ హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఇంతగా పెరగడానికి కారణం ఏమిటి.? అన్న ప్రశ్న సహజంగానే తలెత్తుతోంది. భక్తుల అవసరాలను టీటీడీ పూర్తిస్థాయిలో తీర్చలేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందా.? లేక భోజన సదుపాయాల విస్తరణ విషయంలో టీటీడీ నిర్లక్ష్యం ప్రదర్శించిందా.? అన్న చర్చ ఇప్పుడు భక్తుల్లో జరుగుతోంది. లేక ప్రైవేటు వ్యాపారాలను ప్రోత్సహించి భక్తుల జేబులు ఖాళీ చేయాలన్న ఉద్దేశంతోనే ఇలా ప్రైవేటు టిఫిన్ సెంటర్లను, హోటల్ లను, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను టిటిడి ప్రోత్సహిస్తుందా.?

### భక్తుల రద్దీకి టీటీడీ సిద్ధంగా లేదా..?

రోజురోజుకూ పెరుగుతున్న భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని వసతి, దర్శనం, తాగునీరు, భోజనం వంటి సదుపాయాలను టీటీడీ మరింత విస్తరించాల్సిన అవసరం చాలా ఉంది. అయితే భక్తులు ప్రైవేట్ హోటళ్లపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తుండటాన్ని చూస్తే టీటీడీ ఏర్పాటు చేసే ఆహార సేవలు ఏమాత్రం సరిపోవడం లేదనే అభిప్రాయం భక్తులలో వ్యక్తమవుతోంది. భక్తులకు నాణ్యమైన భోజనం అందించడం కూడా దర్శన ఏర్పాట్లంతే ముఖ్యమైన బాధ్యత. కానీ ఈ అంశంలో టీటీడీ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగడం లేదా.? లేక పరిస్థితులు చేతులు దాటిన తర్వాత స్పందిస్తున్నదా.? భక్తులకు అన్న ప్రసాదాలు పూర్తిస్థాయిలో కల్పించడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### భక్తుల ఆరోగ్యంపై రాజీ ఎందుకు.?

తిరుమలలో ఒక్క ఆహార విషబాధ ఘటన జరిగినా అది టీటీడీ ప్రతిష్ఠకు, శ్రీవారి క్షేత్ర పవిత్రతకు మచ్చ తెచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఫుడ్ సేఫ్టీ శాఖ, ఆరోగ్య శాఖ, టీటీడీ విజిలెన్స్ విభాగాలు వెంటనే సమగ్ర తనిఖీలు చేపట్టాలి. హోటళ్లు, టిఫిన్ సెంటర్ల అనుమతులు, ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి పూర్తిస్థాయి నివేదికలను బహిరంగంగా ప్రజలకు వెల్లడించాలి.

> "భక్తుల అవసరాలను టీటీడీ తీర్చలేకపోతోందా.? లేక భక్తులకు సేవలు అందించడంలో నిర్లక్ష్యం చూపిస్తోందా.? ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు నిజంగా పనిచేస్తున్నారా.? తిరుమలలో ఆహార భద్రతకు బాధ్యులు ఎవరు.?" అనే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు తెలుగుదేశం ప్రభుత్వం తో పాటు టీటీడీ, సంబంధిత శాఖలపై ఉంది. భక్తుల విశ్వాసాన్ని కాపాడాలంటే దర్శనం మాత్రమే కాదు, భోజనం కూడా నాణ్యంగా ఉండేలా చూడాల్సిన అవసరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి ఎంతైనా ఉంది.

# అక్రమ నిర్మాణాలపై డిప్యూటీ కమిషనర్ నిర్లక్ష్యం

▶ గోషామహల్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాలదే రాజ్యం ▶ సెక్షన్ ఆఫీసర్ మహేందర్ కనుసన్నల్లో అవినీతి దందా.?
▶ ఉన్నత అధికారులు, విజిలెన్స్ అమ్ముడుపోయారా అంటూ స్థానికుల ఆగ్రహం ▶ ఒక్కొక్క అధికారికి సిబ్బందికి లక్షలలో లంచాలపై ఏసీబీ విచారణ చేయించాలి















**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** చిన్న గల్లీల్లో భారీ సెల్లార్లు, 8 అంతస్తుల భవనాలతో స్థానికులు విస్మయనికి గురవుతున్నారు. గోషామహల్ సర్కిల్ పరిధిలో భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయనే ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. మున్సిపల్ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ కొందరు బిల్డర్లు అవినీతి అధికారుల అండదండలతో భారీ భవనాలను నిర్మిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. ముఖ్యంగా మంగళ్‌హాట్ ప్రాంతంలో జరుగుతున్న నిర్మాణాలు అధికార యంత్రాంగం పనితీరుపై అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. మంగళ్‌హాట్‌లోని ప్రకాష్ థియేటర్ సమీపంలో, 13-1-12/10 నంబర్‌కు ఎదురుగా ఉన్న ప్రాంతంలో కేవలం 200 గజాల స్థలంలో భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతుండటం చర్చనీయాంశంగా మారింది. స్థానికుల కథనం ప్రకారం సెల్లార్ అనుమతులను దుర్వినియోగం చేస్తూ గోదాముల కోసం స్టీల్ నిర్మాణాలతో కూడిన అక్రమ సెల్లార్లు నిర్మించడమే కాకుండా, ఎనిమిది అంతస్తుల వరకు భవన నిర్మాణం చేపట్టినట్లు స్థానికుల ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోడ్లు ఇరుకుగా ఉన్న చిన్న గల్లీలో ఇంత భారీ నిర్మాణాలు జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలా అనుమతించారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సాధారణ ప్రజలు చిన్న మార్పులు చేసినా వెంటనే నోటీసులు జారీ చేసి కూల్చివేసే అధికారులు, ఇంత పెద్ద ఎత్తున జరుగుతున్న నిర్మాణాలను ఎందుకు పట్టించుకోవడం లేదని, భారీగా లంచాలు తీసుకొని ఇలా చేస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అక్రమ నిర్మాణాల విషయంలో సెక్షన్ ఆఫీసర్ మహేందర్ కీలక పాత్ర ఉందన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. కొందరు బిల్డర్లతో కుమ్మక్కై మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలకు మౌనంగా సహకరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో భవనం నుంచి లక్షలలో చేతులు మారుతున్నాయనే ప్రచారం కూడా స్థానికంగా జోరుగా సాగుతోంది. ఈ ప్రచారంలో నిజానిజాలు ఏమిటో తేల్చాల్సిన బాధ్యత ఏసీబీ, విజిలెన్స్ ఉన్నతాధికారులపై ఉందని వెంటనే ఏసీబీ విజిలెన్స్ విచారణ చేపించాలని ప్రజలు కోరుతున్నారు. ఇక డిప్యూటీ కమిషనర్ ఉమా ప్రకాష్ వ్యవహార శైలిపై కూడా తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై వరుసగా ఫిర్యాదులు వస్తున్నప్పటికీ కఠిన చర్యలు తీసుకోకుండా లంచాలు తీసుకుని చోద్యం చూస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిహెచ్ఎంసి నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నాయనే సమాచారం డిప్యూటీ కమిషనర్ కు ఉన్నప్పటికీ స్పందించకపోవడం వెనుక అసలు కారణాలు ఏమిటనే సందేహాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. జీహెచ్ఎంసీ విజిలెన్స్ విభాగానికి కూడా పలుమార్లు ఫిర్యాదులు అందాయని, అయినప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని విజిలెన్స్ అధికారులు కూడా అమ్ముడుపోయారా.? అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై విజిలెన్స్ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులైన అధికారులు, సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ నిర్మిస్తున్న ఈ భారీ అక్రమ భవనాలపై వెంటనే సర్వే నిర్వహించి, అనుమతులు, నిర్మాణ ప్రణాళికలు, సెల్లార్ వినియోగంపై పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. లేకపోతే గోషామహల్ సర్కిల్ అక్రమ నిర్మాణాలకు కేంద్రబిందువుగా మారిపోతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రజల భద్రత, ప్రభుత్వ ఆదాయం, పట్టణ ప్రణాళిక పరిరక్షణ కోసం జిహెచ్ఎంసి కమిషనర్ తక్షణమే రంగంలోకి దిగి కఠిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588